## త్వరలో అంగన్‌వాడీ ఉద్యోగాల నోటిఫికేషన్

వరంగల్,తెలంగాణ తెచ్చుకుంది ఉద్యోగాల కోసమేనని మంత్రి సీతక్క తెలిపారు. వరంగల్ ఎంకే నాయుడు కన్వెన్షన్‌లో మెగా జాబ్‌మేళా నిర్వహించగా, మంత్రులు సీతక్క, కొండా సురేఖ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడారు. మెగా జాబ్‌మేళాకు భారీ స్పందన వచ్చిందని అన్నారు. భారీ సంఖ్యలో నిరుద్యోగులు తరలివచ్చారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత 60వేల ఉద్యోగాలు ఇచ్చిందని గుర్తుచేశారు. త్వరలో అంగన్‌వాడీ ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేస్తామని తెలిపారు. ఇలాంటి జాబ్‌మేళాను నిరుద్యోగులు ఉపయోగించుకోవాలని సూచించారు. అవకాశాలు వస్తే వాటిని వదులుకోవద్దని అన్నారు. తల్లిదండ్రులకు భరోసా కల్పించాలని చెప్పారు. సొంత ఊరు దాటితేనే.. భవిష్యత్తు బంగారం అవుతుందని మంత్రి సీతక్క తెలిపారు. 60 కంపెనీల ద్వారా 11వేల ఉద్యోగాలు కల్పిస్తున్నామని మంత్రి కొండా సురేఖ తెలిపారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఎన్నికల ముందు తాము చెప్పామని.. అందులో భాగంగానే ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని

# అగ్రనేత


తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి సంపుటి: 10 సంచిక :44 ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ తేది: ఆదివారం 13-04-2025 పేజీలు:4 వెల: 2.00


## రైతులకు రేవంత్ సర్కార్ గుడ్ న్యూస్..ఎకరానికి రూ.10వేలు



హైదరాబాద్,తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆ రైతులకు ఎకరానికి రూ. 10వేలు ఇవ్వాలని నిర్ణయించింది. మొత్తం 20వేల ఎకరాలకు రూ. 10వేల చొప్పున నష్ట పరిహారం పంపిణీ చేయాల్సి వస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం రూ. 20కోట్ల నిధులు అవసరం అవుతాయని అంచనా వేసింది.రైతులు ఎన్నో కష్టాలు ఎదుర్కొన్ని పంటలుసాగు చేస్తున్నారు. అయితే, పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షాలు రైతులను కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి. దీంతో భారీగా నష్టపోతున్న పరిస్థితి. ఈ ఏడాది కూడా అకాల వర్షాలు, ఈదురుగాలులు, వడగండ్ల కారణంగా చేతికొచ్చిన పంటలను రైతులు నష్టపోయారు. దీంతో పంట నష్టపోయిన రైతులను కొంతమేరైనా ఆదుకొనేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అకాల వర్షాలు, ఈదురుగాలుల కారణంగా పంటలు దెబ్బతిన్న రైతులకు ఎకరానికి రూ. 10వేలు చొప్పున పరిహారం అందించాలని రేవంత్ సర్కార్ నిర్ణయించింది.ఈ యాసంగి సీజన్ లో అకాల వర్షాలతో 8,408 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు రైతుల వారీగా నివేదిక అందింది. అయితే, ఈ నెల మూడో తేదీ నుంచి 9వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా కురిసిన అకాల వర్షాలు, వడగండ్ల వానలకు మరింత పంట నష్టం చోటుచేసుకుంది. దాదాపు 14,956 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ప్రాథమిక సమాచారం రాగా.. రైతుల వారీగా సర్వే చేయాలని అధికారులను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఈ సర్వే పూర్తయితే మొత్తం ఎన్ని ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లిందనే విషయంపై స్పష్టత రానుంది. మొత్తం 20వేల ఎకరాల్లో పంట నష్టపోయి ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.రాష్ట్ర బడ్జెట్ నుంచే నష్ట పరిహారం సొమ్ము ఇవ్వాలని రేవంత్ సర్కార్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఎందుకంటే.. పంటల బీమాకు సంబంధించిన కేంద్ర పథకం ఫసల్ బీమా యోజన తెలంగాణలో ఇంకా అమల్లోకి రాలేదు. అయితే, రేవంత్ సర్కార్ తాజా నిర్ణయంతో కొంతమేర అయిన మేలు జరుగుతుందని రైతులు పేర్కొంటున్నారు.

### పద్మ అవార్డుల ఎంపిక ప్రక్రియ...

న్యూఢిల్లీ,వచ్చే సంవత్సరం రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా ప్రకటించనున్న 'పద్మ అవార్డులు 2026' కోసం నామినేషన్లు, సిఫార్సుల పక్రియను కేంద్ర హోమ్ మంత్రిత్వశాఖ ప్రారంభించింది. పద్మ పురస్కారాల కోసం నామినేషన్లు, సిఫార్సులకు ఆఖరి తేదీ జూలై 31 అని, వాటిని రాష్ట్రీయ పురస్కార్ పోర్టల్ పై ఆన్‌లైన్‌లో స్వీకరిస్తారని శుక్రవారం విడుదలైన ఒక అధికార ప్రకటన తెలియజేసింది. పద్మ అవార్డులు పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పద్మశ్రీ దేశంలోని అత్యున్నత పౌర పురస్కారాలు. ఏటా రిపబ్లిక్ డే ముందు రోజు ప్రకటిస్తుంటారు. అన్ని రంగాలు, కళలు, సాహిత్యం, విద్య, క్రీడలు, వైద్యం, సాంఘిక సేవ, సైన్స్, ఇంజనీరింగ్, పబ్లిక్ అఫైర్స్, సివిల్ సర్వీస్, వర్తక, పరిశ్రమ మొదలైన విభాగాలలో విశిష్ట, అసాధారణ విజయాలకు, సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు

## ఇంటిపేరునే వనజీవిగా మార్చుకొని కోట్లాది మొక్కలకు ప్రాణం పోశారు

హైదరాబాద్: ప్రముఖ సామాజిక కార్యకర్త, పద్మశ్రీ వనజీవి రామయ్య గుండెపోటుతో కన్నుమూశారు. ప్రకృతి ప్రేమికుడి మృతిపట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు, పలువురు రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తంచేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.పర్యావరణ పరిరక్షణే ప్రాణంగా బతికిన పద్మశ్రీ వనజీవి రామయ్య మృతిపట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ విచారం వ్యక్తం చేస్తూ, సంతాపం ప్రకటించారు. వృక్షో రక్షతి రక్షితః అనే నినాదాన్ని తన శరీరంలో భాగం చేసుకుని, కోటికి పైగా మొక్కలను నాటి, ప్రపంచానికి పచ్చదనం ప్రాముఖ్యతను ప్రచారం చేసిన వనజీవి రామయ్య లక్ష్యం మహోన్నతమైనదని అన్నారు. మొక్కల పెంపకం కోసం వనజీవిగా మారిన దర్పల్లి రామయ్య జీవితం రేపటి తరాలకు ఆదర్శనీయమని కొనియాడారు. ప్రపంచ పర్యావరణం కోసం సాగిన మానవ కృషిలో వనజీవిగా ఆయన చేసిన త్యాగం అసమాన్యమైనదని కేసీఆర్ అన్నారు.అడవులు, పచ్చదనం అభివృద్ధి దిశగా నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన.. తెలంగాణకు హరితహారం ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు దర్పల్లి రామయ్య అందించిన సహకారం గొప్పదని గుర్తు చేసుకున్నారు. భవిష్యత్తు తరాలకు మనం అందించే సంపద హరిత సంపదే కావాలని, భౌతిక ఆస్తులు కావని పునరుద్ఘాటించారు. పచ్చని అడవులను ధ్వంసం చేస్తూ, వన్యప్రాణులకు నిలువనీడ లేకుండా ప్రభుత్వాలు ప్రదర్శిస్తున్న పర్యావరణ వ్యతిరేక ధోరణులను నిలువరించడానికి, వర్తమాన పరిస్థితుల్లో వేలాది వనజీవి రామయ్యల అవసరం ఉన్నదని స్పష్టం చేశారు. వనజీవి మరణంతో తెలంగాణ ఒక ప్రపంచ పర్యావరణ వేత్తను కోల్పోయిందని విచారం వ్యక్తం చేసారు. శోకంలో మునిగిన వారి కుటుంబ సభ్యులకు అభిమానులకు పర్యావరణ పరిరక్షకులకు కేసీఆర్ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

**పర్యావరణ హితుడు రామయ్య..**

పద్మశ్రీ వనజీవి రామయ్య మరణం తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కోటి మొక్కలు నాటి వనజీవినే తన ఇంటిపేరుగా మార్చుకున్న గొప్ప పర్యావరణ హితుడు రామయ్య. ప్రకృతి లేనిదే మనుగడ లేదని బలంగా నమ్మారన్నారు. వ్యక్తిగా మొక్కలు నాటి సమాజాన్నే ప్రభావితం చేశారన్నారు. ఆమర సూచించిన మార్గం నేటి యువతకు ఆదర్శమని చెప్పారు. ఆయన మరణం సమాజానికి తీరని లోటని చెప్పారు. పర్యావరణ రక్షణకు జీవితాన్ని అంకితం చేసిన ఆయన ఆత్మకు శాంతిచేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ.. కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.వనజీవి రామయ్య



మృతి రాష్ట్రానికి, దేశానికి తీరని లోటని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఆయన జీవితం భవిష్యత్ తరాలకు స్ఫూర్తి అని చెప్పారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. రామయ్య కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**ప్రకృతి ప్రేమికుడు.. హరిత స్వాప్నికుడు..**

వనజీవి మృతిపట్ల సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు సంతాపం తెలిపారు. ప్రకృతి ప్రేమికుడు, హరిత స్వాప్నికుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి దరిపెల్లి రామయ్య మృతి తీరని లోటన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వృక్షో రక్షతి రక్షితః అన్న సిద్ధాంతాన్ని త్రికరణశుద్ధిగా ఆచరించి, మొక్కలను బిడ్డలవలే పెంచారు. ఇంటిపేరునే వనజీవిగా మార్చుకొని కోట్లాది మొక్కలకు ప్రాణం పోశారు. పర్యావరణ హితమే తన ఊపిరిగా భావించిన ఆయన, ఆరోగ్యం సహకరించకున్నా మొక్కలు నాటే ఉద్యమాన్ని మాత్రం ఆపలేదు. వారి జీవితం భవిష్యత్ తరాలకు స్ఫూర్తి. అలాంటి గొప్ప వ్యక్తి వనజీవి రామయ్య నేడు మన మధ్య లేకపోవడం బాధాకరమన్నారు.కోటి మొక్కల ప్రధాత మృతి ప్రకృతి ప్రేమికులకు తీరని లోటని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. వనజీవి రామయ్య ఖమ్మం జిల్లా ఖ్యాతిని ఖండాంతరాలకు చాటి చెప్పారని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. వనజీవి మృతిపట్ల కేంద్ర మంత్రి బండి సంజయ్, బీఆర్ఎస్ వద్దిరాజు రవిచంద్రం సంతాపం వ్యక్తంచేశారు. పద్మశ్రీ వనజీవి రామయ్యను కోల్పోవడం చాలా బాధాకరమని మాజీ ఎంపీ సంతోష్ కుమార్ అన్నారు. చెట్ల పెంపకం, పర్యావరణ పరిరక్షణకు తన జీవితాన్ని అంకితం చేసిన నిజమైన ప్రకృతి యోధుడని చెప్పారు. రామయ్య కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## విజయసాయిరెడ్డి యూటర్న్.. రాజీనామా స్థానం నుంచి మళ్లీ రాజ్యసభకు?

హైదరాబాద్,వైసీపీ మాజీ నేత వి.విజయసాయిరెడ్డి యూటర్న్ తీసుకుంటున్నారా? రాజకీయాల నుంచి వైదొలగుతున్నట్లు ప్రకటించిన విజయసాయిని.. మళ్లీ యాక్టివ్ పాలిటిక్స్ లోకి తీసుకురావాలని ప్రయత్నాలు జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. దక్షిణ భారతదేశంలో బలపడాలని చూస్తున్న బీజేపీ ఏపీలో వీలైనంత ఎక్కువ మందిని సమీకరించుకోవాలని ప్లాన్ చేస్తోందని చెబుతున్నారు. దీంతో వైసీపీకి రాజీనామా చేసిన విజయసాయిరెడ్డిని బీజేపీలో చేర్చుకుని ఆయన రాజీనామా చేసిన స్థానం నుంచే మళ్లీ రాజ్యసభకు పంపాలని ప్లాన్ చేస్తోందని టాక్ వినిపిస్తోంది.రాజకీయ సన్యాసం తీసుకుంటానని స్వయంగా ప్రకటించిన వైసీపీ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి రాజకీయ పునరాగమనంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. కేంద్రంలోని బీజేపీ పెద్దలతో సన్నిహిత సంబంధాలు ఉన్న విజయసాయిరెడ్డి ప్రస్తుతం వ్యవసాయం చేసుకుంటున్నారు. అయితే ఆయనను బీజేపీలో చేర్చుకుని ఏపీలో వైసీపీ అసమ్మతి నేతలను ఆకర్షించాలని బీజేపీ ప్లాన్ చేస్తోంది. ఇప్పటికే బీజేపీ జాతీయ అధ్యక్ష పదవిని దక్షిణాదికి ఇవ్వాలని భావిస్తున్న బీజేపీ, ఈ ప్రాంతంలో పలుకుబడి ఉన్న నేతలను పార్టీలో చేర్చుకుని వచ్చే ఎన్నికల నాటికి ప్రధాన పోటీదారుగా అవతరించాలని ప్రణాళిక రచిస్తోందని అంటున్నారు.వైసీపీ ఆవిర్భావం నుంచి కొనసాగిన విజయసాయిరెడ్డి కొద్దినెలల క్రితం ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసింది. వైసీపీలో నెంబర్ 2 పొజిషనులో పనిచేసిన ఆయన రాజకీయాల నుంచే వైదొలగుతున్నట్లు ప్రకటించారు. అదే సమయంలో నాలుగేళ్ల పదవీ కాలం ఉంటుండగా, రాజ్యసభ సభ్యత్వాన్ని వదులుకున్నారు. ఈ స్థానానికి త్వరలో ఉప ఎన్నిక జరుగుతుందని ప్రచారం జరుగుతున్న వేళ.. విజయసాయిరెడ్డి రాజకీయ పునరాగమనంపై చర్చ మొదలైంది. వాస్తవానికి వైసీపీకి రాజీనామా చేసిన సమయంలోనే విజయసాయిరెడ్డి బీజేపీలో చేరతారని ప్రచారం జరిగింది. కానీ, ఆయన అప్పట్లో ఆ ప్రచారాన్ని ఖండించారు. అయితే రాజకీయాల్లో ఔనంటే కాదని.. కాదంటే ఔననే అర్థంగా అభివర్ణిస్తున్న విశ్లేషకులు



విజయసాయిరెడ్డి–బీజేపీ మధ్య ఏదో జరుగుతోందని అనుమానిస్తున్నారు.వైసీపీలో ఉండగా, విజయసాయిరెడ్డిపై పలు ఆరోపణలు వచ్చాయి. ప్రధానంగా లిక్కర్ స్కాంతోపాటు, కాకినాడ సీపోర్టు వాటాల బదిలీపై విజయసాయిరెడ్డిపై అనుమానాలు ఉన్నాయి. కాకినాడ సీపోర్టు విషయంలో ఆయనపై సీఐడీ విచారణ కూడా జరుగుతోంది. ఇదే సమయంలో లిక్కర్ స్కాంలో తనకు సంబంధం లేదని, ఆ స్కాంలో కర్త, కర్మ, క్రియ అంతా వైసీపీ నేత కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి అంటూ బాంబు పేల్చారు విజయసాయిరెడ్డి. ఆయన ఇలా వైసీపీ నేతలను ఇరికించేలా ప్రకటనలు చేయడం వెనుక వ్యూహం ఉందని రాజకీయ విశ్లేషకులు అనుమానిస్తున్నారు. గత ప్రభుత్వంలో చోటుచేసుకున్న కుంభకోణాలపై తాను సహకరిస్తానని కూటమి ప్రభుత్వానికి సంకేతాలు పంపడంతోపాటు తాను బీజేపీలో చేరేందుకు ఎలాంటి అభ్యంతరాలు లేకుండా చూసుకోవడమే వ్యూహం అంటున్నారు. మొత్తానికి విజయసాయిరెడ్డి పునరాగమనంపై జరుగుతున్న ప్రచారం ఆసక్తిరేపుతోంది. ఇది నిజమో? కాదో? విజయసాయిరెడ్డి క్లారిటీ ఇవ్వాల్సివుందని అంటున్నారు.

## బోర్డర్‌లో ఎదురుకాల్పులు.. ఒక సైనికుడికి గాయాలు



జమ్మూ : జమ్మూ కాశ్మీర్‌లోని అఖ్నూర్ సెక్టార్‌లో ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. నియంత్రణ రేఖ వెంబడి చొరబాటు ప్రయత్నాన్ని భారత సైన్యం తిప్పికొట్టింది. ఈ కాల్పుల్లో ఒక సైనికుడు తీవ్రంగా గాయపడ్డాడు. నియంత్రణ రేఖ వెంబడి జరిగిన కాల్పుల్లో ఒక జూనియర్ కమిషన్డ్ అధికారి తీవ్రంగా గాయపడినట్టు సైన్యం తెలిపింది. బాధితుడిని ఆస్పత్రికి తరలించారు.పాకిస్థాన్ సైన్యం ఈ మధ్య పదే పదే కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తోంది. ఇటీవల కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి చొరబాటుకు ప్రయత్నించింది. దీన్ని భారత సైన్యం తీవ్రంగా తిప్పికొట్టింది. తాజాగా మరోసారి ఉల్లంఘించింది. దీంతో సైన్యం సమర్థవంతంగా తిప్పికొట్టిందని అధికారులు తెలిపారు. కాల్పుల్లో మాత్రం ఒక సైనికుడు తీవ్రంగా గాయపడినట్లుగా పేర్కొంది.ఇదిలా ఉంటే జమ్మూ కాశ్మీర్‌లోని కిష్త్వార్ జిల్లాలోని మంచుతో కప్పబడిన ప్రాంతంలో జరిగిన ఆపరేషన్‌లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారని సైన్యం శనివారం తెలిపింది. పెద్ద ఎత్తున ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. ఏకే 47, ఎం4 రైఫిల్ స్వాధీనం చేసుకున్నారు.

## ఇప్పటప్పట్లో నో అంటున్న కేసీఆర్ !



హైదరాబాద్,బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాజకీయంగా చూస్తే తలపండిన వారు. విశేష అనుభవం కలిగిన నేత. రెండు సార్లు తెలంగాణాకు సీఎం గా పనిచేసిన గులాబీ బాస్ కి రాజకీయం ఎలా చేయాలో నేర్పడం అంటే చెరువులో చేపకు ఈత నేరపడమే. కేసీఆర్ కి ఎపుడు ఏమి చేయాలో తెలుసు. అందువల్లనే ఆయన ఎర్రవల్లి ఫాం హౌస్ నుంచే తన భవిష్యత్తు రాజకీయాన్ని రచిస్తున్నారు అని అంటున్నారు.తెలంగాణాలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. పదిహేను నెలలు మాత్రమే ఆ పార్టీ పవర్ లోకి వచ్చి కూడా అయింది. ఇంకా మూడు వంతుల అధికారం చేతిలో ఉంది. ఇక కాంగ్రెస్ అంటేనే గ్రూపులు. బయటకు తెలియని గొడవలు ఎన్నో ఉంటాయి. అంతే కాదు కాంగ్రెస్ ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చింది. కొన్ని చేసినా ఇంకా అందని వారు ఉన్నారు. చేయాల్సినవి మరిన్ని ఉన్నాయి.అలాగే కాంగ్రెస్ పాలన పట్ల జనాలకు ఇపుడిపుడే కొంత అసంతృప్తి అన్నది బయటపడుతోంది. ఇది చాలదని ఇంకా పెరగాలని కేసీఆర్ కోరుకుంటున్నారు. తాము ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసినా జనాలు కాంగ్రెస్ కి కోరి వరమాల వేసి తెచ్చుకున్నారు అని అందువల్ల కాంగ్రెస్ కథ పక్కానికి చేరాలని కేసీఆర్ ఆశిస్తున్నరని అంటున్నారు.అదే విధంగా తాము ఇపుడే జనంలోకి వెళ్ళి మరీ ఎంత గొంతు చించుకున్నా కూడా ఉపయోగం ఉండదని ఆయన భావిస్తున్నారుట. సరైన సమయం వస్తే అపుడు జనాలకు తాము ఏమి చెప్పినా తారక మంత్రంగా వినిపిస్తుందని కూడా భావిస్తున్నారుట. అందుకే ఆయన జాంలోకి రావడానికి పెద్దగా ఇష్టపడడం లేదని అంటున్నారు.ఇక ఈ నెలలో 27వ తేదీన బీఆర్ఎస్ ఆవిర్భావ సభ ఉంది. ఆ రోజున కేసీఆర్ బయటకు వచ్చి అధికార కాంగ్రెస్ మీద తీవ్ర విమర్శలు చేసే అవకాశాలు ఉన్నాయి ఆ తరువాత ఆయన మళ్ళీ తన ఫాం హౌస్ కే పరిమితం అవుతారని అంటున్నారు.ఇంకా నలభై అయుదు నెలల అధికారం ఉన్న కాంగ్రెస్ తప్పుల మీద తప్పులు చేస్తుందని అవే తమకు శ్రీరామ రక్ష అవుతాయని కేసీఆర్ తలపోస్తున్నారని అంటున్నారు. అయితే కేసీఆర్ ఫాం హౌస్ లో ఊరకే కూర్చోవడం లేదుట. పార్టీని పటిష్టం చేసే వ్యూహాలను రచిస్తున్నారు పార్టీ నాయకులతో తరచూ మీటింగ్స్ పెడుతున్నారుపార్టీని ఎలా బలోపేతం చేయాలో సూచిస్తున్నారు. మరో వైపు తనకు ఎంతో ఇష్టం అయిన వ్యవసాయన్ని దగ్గరుండి ఆయన పర్యవేక్షిస్తున్నారు అని అంటున్నారు. దేనికైనా సమయం రావాలన్నది కేసీఆర్ తన విశేష అనుభవంతో గ్రహించారు అని అంటున్నారు. అందువల్ల జనం వద్దకు తాము ఎపుడు పడితే అపుడువెళ్ళడం కాదు, సందర్భం వచ్చినపుడు వెళ్ళటమే ఉత్తమం అన్న రాజనీతిని ఫాలో అవుతున్నారు అంటున్నారు అందుకే ఇప్పట్లో బయటకు వచ్చే చాన్స్ అయితే పెద్దాయనకు లేదని అంటున్నారు. బహుశా ఆయన రాజకీయం అంతా 2026 తరువాత స్టార్ట్ కావచ్చు అన్నది గులాబీ పార్టీలో ఇన్నర్ టాక్ గా ఉంది మరి.

## వక్ఫ్ చట్టంపై బెంగాల్‌లో హింస.. భారీగా ఆస్తులు ధ్వంసం

కోల్ కతా :వక్ఫ్ చట్టం అమల్లోకి వచ్చిన దగ్గర నుంచి పశ్చిమబెంగాల్ అట్టుడుకుతోంది. గత కొద్ది రోజులుగా ఆందోళనలు, నిరసనలు వ్యక్తమవుతున్నాయి. పరిస్థితుల్ని గమనించిన ముఖ్యమంత్రి మమతా బెనర్జీ..ఎట్టి పరిస్థితుల్లో బెంగాల్‌లో వక్ఫ్ చట్టం అమలు చేయబోమని తేల్చి చెప్పారు. విభజన రాజకీయాలను ఏ మాత్రం అంగీకరించనని పేర్కొన్నారు. అయినా కూడా బెంగాల్‌లో అల్లర్లు మాత్రం ఆగలేదు.శుక్రవారం ఉవ్వెత్తున నిరసనలు ఎగిసిపడ్డాయి. భారీగా హింస చెలరేగింది. దీంతో పెద్ద ఎత్తున ఆస్తులు ధ్వంసం అయ్యాయి. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి రైల్వే పోలీస్ ఫోర్స్ సిబ్బంది లాఠీచార్జ్ చేయాల్సి వచ్చింది. భద్రతా సిబ్బందిపై ఆందోళనకారులు కూడా రాళ్ళు రువ్వారు. ఈ ఘటనలో పలువురు గాయపడ్డారు. అనంతరం సరిహద్దు భద్రతా దళ సిబ్బంది కూడా మోహరించారు. ప్రస్తుతం పరిస్థితులు అదుపులోకి వచ్చినట్లు సమాచారం.మైనారిటీలు ఎక్కువగా నివసించే ముర్షిదాబాద్ జిల్లాలోని నిమ్టిటా, సుటి దగ్గర ఆందోళనకారులు, భద్రతా సిబ్బంది మధ్య ఘర్షణలు చోటు చేసుకున్నాయి. నిమ్టిటా రైల్వే స్టేషన్ దగ్గర నిరసనకారులు గంటల తరబడి రైల్వే ట్రాక్‌లను దిగ్బంధించి.. రైల్వే ఆస్తులను ధ్వంసం చేశారు. రంగంలోకి దిగిన రైల్వే పోలీస్ ఫోర్స్ సిబ్బంది లాఠీచార్జ్ చేశారు.దక్షిణ 24 పరగణాల జిల్లాలోని అమ్తాలా ప్రాంతంలో వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న ప్రజలు.. స్థానిక పోలీసు సిబ్బందిపై దాడి చేయడంతో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు ప్రతిఘటించారు. దీంతో జాతీయ రహదారి 117 పై కొంతసేపు ట్రాఫిక్ స్తంభించింది. హుగ్లీ జిల్లాలోని చంపానీలో కూడా ఇదే పరిస్థితి ఏర్పడింది.ప్రతిపక్ష నాయకుడు సువేందు అధికారి మాట్లాడుతూ.. భారత రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఈ విధంగా అల్లర్లు సృష్టించడం చట్టాన్ని వ్యతిరేకించినట్లేనన్నారు. క్రూరమైన రాడికల్ మూకల కారణంగా ప్రజా భద్రత దెబ్బతింటుందని వ్యాఖ్యానించారు. నిరసనల పేరుతో హింస, అరాచకం సృష్టించడం చట్టవిరుద్ధమైన కార్యక్రమాలని పేర్కొన్నారు.ఇక ఈ హింసపై గవర్నర్



సీవీ. ఆనంద బోస్.. ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో మాట్లాడారు. అలాగే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ పంత్‌తో మాట్లాడి పరిస్థితిని అదుపులో ఉంచడానికి పోలీసులు సత్వర మరియు కఠినమైన చర్యలు తీసుకోవాలని గవర్నర్ సందేశాన్ని అందజేశారు. ముఖ్యమంత్రితో కూడా చర్చలు జరిపినట్లు గవర్నర్ తెలిపారు. బెంగాల్‌లో కొన్ని ప్రాంతాల్లో హింస సృష్టించే అవకాశం ఉందని.. పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

### టెట్ షెడ్యూల్ విడుదల

హైదరాబాద్,తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష షెడ్యూల్ విడుదలైంది. జూన్ 15 నుంచి 30 వరకు టెట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ వెల్లడించింది. ఈ పరీక్షకు సంబంధించిన పూర్తి వివరాలు ఏప్రిల్ 15 నుంచి అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపింది. తెలంగాణలో ఏడాదిలో రెండుసార్లు టెట్ పరీక్ష నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విషయాన్ని గతేడాది జులైలో ప్రకటించింది. ఇందులో భాగంగా గతేడాది డిసెంబర్‌లో టెట్ నోటిఫికేషన్ ఇచ్చిన ప్రభుత్వం.. ఈ ఏడాది జనవరిలో పరీక్షలు నిర్వహించింది.

## సంపాదకీయం

ఆదివారం 13-04-2025

# కాంగ్రెస్ కులరాజకీయం ప్రమాదం!

కులరహిత సమాజం కావాలని ఎలుగెత్తుతున్న వారికి..రాహుల్ లేదా కాంగ్రెస్ తీర్మానాలు చెంపపెట్టు లాంటివి. దేశంలో కులగణన అవసరమా లేదా అన్నది వీరు చెప్పాలి. ముఖ్యంగా లెఫ్ట్ పార్టీలు ఈ విషయంలో తమ అభిప్రాయం చెప్పాల్సిన అవసరం ఏర్పడింది. కులాలతో సమాజాన్ని చీల్చడం అవసరమా అన్నది తేల్చాలి. రాజకీయ పార్టీలు తమ ఓటు బ్యాంక్ కోసం చేసే దుర్మార్గపు ఎత్తులను అందరూ ఓ కన్నేసి నిలదీయాలి. అహ్మదాబాద్‌లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో మరోమారు కులగణనకు ప్రాముఖ్యతను ఇచ్చింది. తెలంగాణ రాష్ట్రం కులగనన చేసి అద్భుతం చేసిందని రాహుల్ అన్నారు. ఇలా దేశమంతా కుల గణన చేయాలని కాంగ్రెస్ కోరుకుంటోంది. తెలంగాణలో చేశారు. ఏం సాధించారన్నదానికి సమాధానం లేదు. వెనకబడిన వర్గాలకు వారి వాటా దక్కడం లేదని రాహుల్ కన్నీరు ఒలకబోసారు. ముందుగా కాంగ్రెస్ నుంచే సంస్కరణలు రావాలి. తమ కుటుంబం నుంచి ముగ్గురు ఎంపిలు ఉన్నారు. సోనియా, రాహుల్, ప్రియాంకల్లో ఒకరుమాత్రమే ఎంపిలుగా ఉండి, మిగతా రెండి ఆదివాసీ లేదా దళితులకు కేటాయించి ఆదర్శం చాటాలి. అప్పుడే వారి మాటలకు అర్థం ఉంటుంది. కేవలం దమ్మీగా మల్లికార్జున ఖర్గేను కూర్చోబెడితే సరిపోదు. కులగణన, కటుంబ పాలన పోతే తప్ప ఈ దేశం బాగుపడదు. ప్రధాని మోదీ మతాల మధ్య చిచ్చు పెట్టి దేశాన్ని విభజించాలని చూస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి కూడా స్థాయికి మించి విమర్శలు చేశారు. మతాల మధ్య బ్రిటిషర్లు చిచ్చు పెడితే దానిని కొనసాగించిందే కాంగ్రెస్ పార్టీ. ఈ విషయం చరిత్ర చూస్తే తెలుస్తుంది. మోదీ కులగనన వద్దనే అంటున్నారు. సమాజాన్ని చీల్చవద్దని అంటున్నారు. చీల్చాలని చూస్తున్న కాంగ్రెస్ మోదీని ఎలా విమర్శిస్తుందన్నది సిఎం రేవంత్ రెడ్డి చెప్పాలి. గాంధీ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా పనిచేస్తూ గాడ్సే సిద్ధాంతాన్ని ప్రోత్సహిస్తున్నారని రేవంత్ చేసిన వ్యాఖ్యల్లో కూడా బలం లేదు. కేవలం రాహుల్ మెప్పుకోసం సిఎం రేవంత్ తంటాలు పడుతున్నారు. కులగణనపై తెలంగాణలో విమర్శలు వచ్చాయి. అసమగ్రంగా ఉందని అన్నారు. ముస్లింలను బిసిల్లో చేర్చడంపై బిజెపి విమర్శిస్తోంది. దీనికి సమాధానం లేదు. దేశ యువత ఏకం కావాల్సిన సమయం వచ్చిందంటున్న వారు...కులాలతో విభజించిన తరవాత ఇక ఎలా ఏకమవుతారో కాంగ్రెస్ పెద్దలు ఆత్మవిమర్శ చేసుకోవాలి. ప్రజల్లో ఐక్యత లేకుండా కులాల కుంపట్లు రాజేయడం ద్వారా రాజకీయ చలి కాచుకోవాలని కాంగ్రెస్ చూస్తోంది. ఈ ఉచ్చులో ప్రజలు పడకపోవడమే మంచిది. ఇప్పుడిప్పుడే విదేశాల్లో అవకాశాలతో అమెరికా,తదితరదేశాల్లో ఉద్యోగాలు పొందిన యువత, కులాల కుంపట్లకు దూరంగా ఉన్నారు. దేశాన్ని విభజించడమే మోదీ లక్ష్యం అంటున్న రేవంత్ రెడ్డి..దేశాన్ని ఎవరు ఎప్పుడు ఎలా విభజించారో..దాని పర్యవసానాలు ఎలా ఉన్నాయో గుర్తిస్తే మంచిది. తెలంగాణలో బీజేపీని, మోదీని అడుగు పెట్టనివ్వం అని అంటున్న రేవంత్ రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల్లో తలబొప్పి కట్టిన విషయం మరచి పోయినట్లు ఉన్నారు. రాజకీయాల్లో హుందాగా మాట్లాడడం అవసరం అని గుర్తిస్తే మంచిది. ఇకపోతే కాంగ్రెస్ సమావేశం ప్రధానంగా కులగనన చుట్టే తిరిగింది. కులగనన ద్వారా తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందని, దేశమంతా కులగణన జరగాలన్నదే కాంగ్రెస్ లక్ష్యమని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చెప్పి , ఆయన దేశంలో విభజనకు బీజం వేస్తున్నారు. ఆయా వర్గాలకు వారి హక్కులు లభించాలంటే ఎవరు ఎంతమంది ఉన్నారన్న లెక్క తేలాల్సి ఉందన్న భాష్యం చెప్పారు. ప్రైవేట్ సంస్థల్లో దళితులు, ఆదివాసీలు, ఇతర వెనకబడిన వర్గాలకు వారి వాటా దక్కడం లేదని వాపోయారు. ఆదానీ, అంబానీ కంపెనీల ఉద్యోగుల జాబితా తీయాలన్నారు. తరచూ అమెరికా వెళుతున్న రాహుల్ అక్కడికి వెళ్లి భారత్ నుంచి ఎంపిక చేసుకునే వారిని కులాల వారీగా ఎంచుకోవాలని చెబితే బాగుంటుంది. ఆయా కంపెనీలతో సిఇవోలతో సమావేశాలు పెట్టి ఇలాంటి డిమాండ్ చేయాలి. అంతెందుకు వారసత్వ పార్టీకి నాయకుడుగా ఉన్న రాహుల్ తమ కుటుంబానికి ఉన్న మూడు ఎంపి సీట్లు త్యాగం చేసి పోరాడితే బాగుంటుంది. కానీ ఆ పని మాత్రం చేయరు. ఇకపోతే రాజ్యాంగమే కాంగ్రెస్ ఆత్మ అని, దానిని పరిరక్షించు కునేందుకు మనమంతా కలసి పోరాడాలని పిలుపునిచ్చారు. నిజానికి రాజ్యాంగానికి వచ్చిన ప్రమాద మేమిటో చెప్పలేదు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ మత స్వేచ్ఛ మీద దాడి చేస్తున్నాయని రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలు నమ్మడానికి దేశ ప్రజలు సిద్ధంగా లేరు. దేశంలో కాంగ్రెస్ ఏలుబడిలో మెజార్టీ హిందువులు ఎలా ఊచకోతకు గురయ్యారో మననం చేసుకోవాలి. ఉమ్మడి ఎపిలో కాంగ్రెస్ పాలనలో మతకల్లోలాల్లో ఎంతమంది అమాయకులు బలయ్యారో గుర్తు చేసుకోవాలి. 370 ఉక్కు చట్రంలో కాశ్మీర్‌లో మెజార్టీ హిందువుల ఊచకోత ఎలా జరిగిందో చెప్పాలి. కాంగ్రెస్ ఐడియాలజీ రాజ్యాంగమని.. అందుకే బీజేపీ ధ్వంసం చేస్తోందని ఆరోపించినంత మాత్రాన కాంగ్రెస్ దాచితే దాగే సత్యాలు కావు. ఆధునిక సమాజంలో ఎవరికి వారు తమ కులవృత్తులను వదిలేశారు. తమకోసం అవసరమైన వృత్తులను ఎంచుకున్నారు. అలా వారు ప్రపంచంతో కలసి నడుస్తున్నారు. కులాల కుంపట్లకు దూరంగా ఉండాలని దేశంకోరుకుంటుంటే రాహుల్ కులాల కుంపట్లు పెట్టి రాజకీయ లబ్ధికోసం పోరాడుతున్నారు. కులగణన వల్ల దేశంలో బీసీల సంఖ్య ఎంతో తెలుస్తుంది. దాంతో ఏం చేస్తారు. ఎస్సీ,ఎస్టీ, బిసిల్లో కొందరు ఇప్పుడు రాజకీయం గా,ఆర్థికంగా ఎదిగారు. వారిని ఫలానా కులం అని చెప్పగలమా అన్నది ఆలోచన చేయాలి. దళితులను, ఆదివాసీలను వారి కులాల పేరుతో ఆధునిక సమాజానికి దూరం చేయరాదు. ప్రజల్లో ఐక్యతకు మాత్రమే మనమంతా పనిచేయాలని గుర్తిస్తే మంచిది.

# కుట్రదారులను పట్టుకోవాల్సిందే... !



ముంబై:2008 ముంబయి దాడుల కుట్రల వెనక ఎవరెవరు ఉన్నారన్నది బయటకు రావాల్సి ఉంది. ఈ కేసులో పాకిస్థాన్ ప్రమేం ఉన్నట్లు భారత్ గట్టి ఆధారాలు సేకరించినా పాక్ తోసిపుచ్చింది. అయితే ప్రపంచం ముందు పాక్‌ను దోషిగా నిలబెట్టడంలో భారత్ విజయం సాధించింది. కసబ్ తదితరులను ఉ రితీసాక కూడా పాక్ ఉగ్రవాదాన్ని ఎప్పటికప్పుడు ప్రపంచ వేదికలపై భారత్ ఎండగడుతూనే ఉంది. ఇదే క్రమంలో పాక్‌కు కూడా గట్టిగా బుద్ధి చెప్పేలా చర్యలు తీసుకునేందుకు వెనకాడడం లేదు. గతంలో పాలకులు పాక్ పట్ల నిర్లిప్తంగా వ్యవహరించారు. ఎన్నిమార్లు అవకాశాలు వచ్చినా వదిలేశారు. అవే ఇప్పుడు మనకు శాపంగా మారాయి. పాక్‌తో యుద్ధం, బంగ్లాదేశ్ విముక్తి తదితర సందర్భాల్లో పాక్‌ను తుదముట్టించివుంటే ఇవాళ ఈ దుర్గతి పట్టేది కాదు. తాజాగా ఇప్పుడు తహవ్వుర్ రాణాను రప్పించడంలో భారత్ కృషి మరువలేనిది. ఇదే సందర్బంలో రాణా నుంచి వివరాలు సేకరిస్తే..ముంబై దాడుల వెనక ఉన్న పెద్ద తలకాయల పేర్లు బయటపడగలవు. అయితే రాణా అంత సులువుగా బయటపడతాడని అనుకోవడానికి లేదు. ఇకపోతే భారత్ పట్ల నరనరాన వ్యతిరేకతను నింపుకున్న రాణా ముంబై దాడుల కోసం ఎంతగా తెగించాడన్నది ప్రపంచ దేశాలతో పాటు పాక్‌కు కూడా అర్థం అయివుంటుంది. ముంబై దాడుల వెనక ఉగ్రవాదులుగా మారిన ఇద్దరు స్కూల్ ఫ్రెండ్స్ మాస్టర్ మైండ్స్‌గా వ్యవహరించారు. 166 మంది ప్రాణాలు పొట్టన పెట్టుకొన్నారు. అమెరికా చట్టాల్లోని లొసుగుల్ని వాడుకొని భారత్‌కు దొరక్కుండా తప్పించుకోవాలని విశ్వప్రయత్నం చేశారు. చివరికి ఒకరిని జాతీయ దర్యాప్తు సంస్థ భారత్‌కు తీసుకొచ్చింది. మరొకరు అమెరికా జైల్లోనే ఇప్పటికీ ఉన్నాడు. వారిద్దరే తహవ్వుర్ రాణా, డేవిడ్ కోల్‌మన్ హెడ్లీ. వీరిద్దరి వయస్సు 64 ఏళు .. వీరిని గుర్తించి ఇరికించడం లో ఎన్ఐఎ తీవ్రంగా కృషి చేసింది. వీరిద్దరూ పాక్‌లోని హసన్‌అబ్దుల్‌లోని సైనిక అకాడమీ అయిన క్యాడెట్ కాలేజ్ (సీసీహెచ్)లో చదువుకున్నప్పటి నుంచి మిత్రులు కావడం, తరవాత ఉగ్రవాదులు గా మారడం గమనించాలి. ఇక్కడ బోర్డింగ్ స్కూల్, కాలేజ్ నిర్వహిస్తున్నందున వీరిద్దరూ ఇక్కడ చేరారు. తరవాత మిత్రులుగా మారారు. 8వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఉంటాయి. వివిధ రకాల పరీక్షలు నిర్వహించి వీటిలోకి ఎంపిక చేస్తారు. డేవిడ్ హెడ్లీ పాకిస్థానీ దౌత్యవేత్త, బ్రాడ్‌కాస్టర్ అయిన దావూద్ సయ్యద్ గిలానీ, ఓ అమెరికా జాతీయురాలికి పుట్టాడు. ఆ తర్వాత గిలానీ కుటుంబం పాక్‌కు వలస వెళ్లింది. అక్కడే హెడ్లీ సీసీహెచ్‌లో చేరాడు. ఇక తహవ్వుర్ రాణా 1961లో ఓ హైస్కూల్ ప్రిన్సిపల్ కుటుంబంలో జన్మించాడు. ఇతడూ సీసీహెచ్‌లోనే చేరాడు. అక్కడే తొలిసారి హెడ్లీ–రాణా మిత్రులుగా మారారు. అక్కడి నుంచే వారి ఉగ్రరచనలకు బీజం పడిందని చెప్పాలి. ఆ తర్వాత కాలంలో హెడ్లీ తల్లితో కలిసి అమెరికా లోని ఫిలడెల్ఫియాకు వెళ్లిపోయాడు. అక్కడ అతడు మాదక ద్రవ్యాల వ్యాపారం, కీలక సమాచారాన్ని ఏజెన్సీలకు విక్రయించేవాడు. పాక్‌లో లష్కరే, సైన్యానికి, ఇటు– అమెరికాలోని సీఐఏకు ఇన్ఫర్మేషన్ చేరవేసేవాడు. మరోవైపు రాణా పాక్ ఆర్మీ మెడికల్ కోర్‌లో కెప్టెన్ హోదాలో పని చేశాడు. 1997లో ఆర్మీని వదిలేసి.. భార్యతో కలిసి కెనడాకు వలసవెళ్లి 2001 నాటికి పౌరసత్వం సంపాదించాడు. టొరెంటోలో 'ఫస్ట్ వరల్డ్ ఇమిగ్రేషన్ సర్వీస్' పేరిట ఓ సంస్థను స్థాపించాడు. ఆ తర్వాత దాని కార్యాలయాలను చికాగో, న్యూయార్క్‌ల్లోను తెరిచాడు. ఈ కంపెనీ ముసుగులోనే అతడు ముంబయి దాడులకు కుట్రను అమలు చేశాడని బహిర్గతం అయ్యింది. 2006 నుంచి ముంబయి దాడులకు కుట్ర రచన మొదలైంది. ఇవన్నీ కూడా ఎన్ఐఎ సేకరించగలిగింది. అదే ఏడాది హెడ్లీ తొలిసారి ముంబయిని సందర్శించాడు. అప్పుడు మెస్సర్స్ ఇమిగ్రేషన్ లా సెంటర్ పేరిట ఓ కార్యాలయం ఏర్పాటుకు ఆర్‌బీఐకు పత్రాలు సమర్పించాడు. వీటిపై రేమాండ్ జోసఫ్ శాండర్స్ అనే వ్యక్తి సంతకాలున్నాయి. ఇది రాణాకు చెందిన ఫస్ట్ వరల్డ్ ఇమిగ్రేషన్‌కు అనుబంధంగా పనిచేసింది. ఇందుకోసం టార్డియో ఏసీ మార్కెట్‌లో ఆఫీస్ స్పేస్ తీసుకొన్నాడు. భారత్ వచ్చినప్పుడు దానిని స్థావరంగా వాడుకొన్నాడు. మొత్తం ముంబయిలో ఎనిమిది సార్లు పర్యటించి రెక్కీలు నిర్వహించాడని ఎన్ఐఎ పసిగట్టింది. దాడులకు రెండు వారాల ముందు రాణా స్వయంగా భారత్‌కు వచ్చాడు. అతడు ఫైవ్‌స్టార్ హోటల్ పొవాయ్‌లో దాదాపు 10 రోజుల పాటు తిష్ఠ వేసి కుట్రలు పన్నాడు. డేవిడ్ హెడ్లీకి అవసరమైన వీసాను రాణానే ఇప్పించినట్లు జాతీయ దర్యాప్తు సంస్థ వెల్లడించింది. ఇందుకోసం అతడి పేరు, తండ్రి వివరాలను తప్పుగా చూపించారు. ముంబయిలో తన ఎనిమిది రెక్కీల సందర్భంగా హెడ్లీ నిరంతరం రాణాతో టచ్‌లో ఉన్నాడు. ఇందుకోసం 231 ఫోన్‌కాల్స్ చేశాడని ఎన్ఐఎ గుర్తించింది. అతడు చేసిన సాయానికి ప్రతిగా..పాక్ ఐఎస్ఐ అధికారులతో మాట్లాడి ఓ డీల్ కుదిర్చాడు. రాణా పాకిస్థాన్‌ను సందర్శించడానికి వీలుగా అతడికి మేజర్ ఇక్బాల్‌ను పరిచయం చేశాడు. దీంతో ఆ మేజర్ రాణాతో మాట్లాడినట్లు తేలింది. భారత్‌లో ఉన్నప్పుడు నేరుగా పాక్‌కు కాల్స్ చేయొద్దని హెడ్లీకి స్పష్టమైన ఆదేశాలున్నాయి. ముంబయి దాడుల తర్వాత కూడా హెడ్లీ–రాణా టచ్‌లో ఉన్నారు. ఇక విజయ వంతంగా ముంబయిలో మారణహోమం సృష్టించినందుకు ఉగ్రవాది లష్కరే సాజిద్‌ను రాణా అభినందిం చాడు. ఈ దాడిలో మరణించిన ఉగ్రవాదులకు పాక్ అత్యున్నత పురస్కారం నిషాన్ ఈ హైదర్ ఇవ్వాలని హెడ్లీ వద్ద రాణా వ్యాఖ్యానించాడు. భారతీయులకు అలా జరగాల్సిందేనని కూడా వ్యాఖ్యానించాడు. 2009 అక్టోబర్ 3న చికాగో అంతర్జాతీయ విమానాశ్రయంలో హెడ్లీని ఎఫ్‌బీఐ అరెస్టు చేయడంతో ఇద్దరి స్నేహం ముగిసింది. అతడు సీఐఏకు పని చేస్తున్నా.. తరచూ పాక్‌కు వెళ్లి రావడంపై అమెరికా నిఘా సంస్థ కన్నేసింది. డెన్మార్క్‌లోని కోపన్‌హెగన్‌లో ఉగ్రదాడికి కుట్ర పన్నుతున్నట్లు అతడిపై అనుమానాలు ఉ న్నాయి. అప్పటికే హెడ్లీని తమకు అప్పగించాలని భారత్ అమెరికాను కోరుతోంది. ఆ తర్వాత కొన్ని నెలలకే రాణాను కూడా డెన్మార్క్ కుట్ర కేసులో అరెస్టు చేశారు. ఈ నేరం నిరూపితమైనా.. భారత్‌లో ముంబై దాడుల కుట్ర అభియోగాలు మాత్రం వీగిపోయాయి. ఈ విచారణ సందర్భంగా తనను హెడ్లీ ఇందులోకి లాగాడని రాణా చెప్పాడు. డెన్మార్క్ కుట్ర కేసులో రాణాకు వ్యతిరేకంగా హెడ్లీ కూడా సాక్ష్యం చెప్పడంతో ఈ కేసులో రాణాకు 14 ఏళ్ల జైలు శిక్ష పడింది. అతడు 2020 కొవిడ్ సమయంలో విడుదలయ్యాడు. ఆ మర్నాడే అతడిని అరెస్టు చేయడానికి నేరగాళ్ల అప్పగింత ఒప్పందం మేరకు అమెరికా వారెంటు కోరింది. దాదాపు ఐదేళ్లు వివిధ దశల్లో జరిపిన న్యాయపోరాటం తర్వాత అతడు విచారణను ఎదుర్కోవడానికి భారత్‌కు తీసుకొచ్చారు.మొత్తంగా ఎన్ఐఎ చేసిన కృషి సాహసోపేత మైనదని చెప్పాలి. ఇది ఓ అరకంగా అంతర్జాతీయంగా భారత్ ప్రతిష్టను పెంచేదే. రాణ నోరు మెదిపితేనే విషయాలు, వివరాలు బయటకు వస్తాయి. అప్పుడే మనకు విజయం దక్కుతుంది.

# సుప్రీం తీర్పు 'గవర్నర్'కు కనువిప్పు



న్యూఢిల్లీ,రాజ్యాంగ పరమైన ప్రక్రియకు విరుద్ధంగా గవర్నర్లు తమ బిల్లులను ఆమోదించకుండా విపరీతంగా కాలయాపన చేస్తున్నారని తమిళనాడు కేరళ, పంజాబ్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాలు గతంలో సుప్రీం కోర్టు ముందు మొరపెట్టుకున్న సంగతి తెలిసిందే. తమిళనాడు శాసనసభ గవర్నర్ ఆమోదం కోసం పంపిన బిల్లులను ఆ రాష్ట్ర గవర్నర్ ఎలాంటి పరిశీలన చేయకుండా మూడేళ్లుగా తన వద్దే అట్టే పెట్టుకోవడంపై గతంలో సుప్రీం కోర్టు ఆక్షేపించడం కూడా జరిగింది.అయినా గవర్నర్ వైఖరిలో మార్పురావడం లేదు. ఈసారి 10 బిల్లులను రాష్ట్రపతి పరిశీలనకు పంపాలన్న సాకుతో తమిళనాడు గవర్నర్ తన వద్దే పెండింగ్‌లో పెట్టుకోవడం సుప్రీం కోర్టు ముందుకు విచారణ వచ్చింది.ఈసారి సుప్రీం కోర్టు ధర్మాసనం మళ్లీ గవర్నర్‌కు తన రాజ్యాంగ పరిధి, బాధ్యతలు ఎంతవరకో గుర్తు చేసింది. అంతేకాదు అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను గవర్నర్లు శాశ్వతంగా తమ వద్ద ఉంచుకోలేరని పరోక్షంగా హెచ్చరించింది. కీలక బిల్లులకు సమ్మతి తెలపకుండా పెండింగ్‌లో ఉంచడం చట్టవిరుద్ధమంటూ మంగళవారం ( ఏప్రిల్ 8) తీర్పు ఇచ్చింది. ఏకంగా 10 బిల్లులను రాష్ట్రపతి పరిశీలనకు పంపాలన్న గవర్నర్ చర్య ఏక పక్షమేకాక, చట్టవిరుద్ధమని తేల్చిచెప్పింది. రాజ్యాంగం ప్రకారం గవర్నర్‌కు కొన్ని అధికారాలు, అవకాశాలు ఉంటాయి. శాసనసభ పంపిన బిల్లుకు ఆమోదం తెల్పడం, అభ్యంతరాలుంటే పెండింగ్‌లో పెట్టడం, ఆ అభ్యంతరాలను శాసనసభకు తెలియజేస్తూ తిరిగి వెనక్కు పంపడం లేదా రాష్ట్రపతి పరిశీలనకు పంపడం వంటివి గవర్నర్ ప్రధాన బాధ్యతలు.ఇవేవీ సక్రమంగా నిర్వర్తించకుండా తన వద్దనే అట్టేపెట్టుకోవడం రాజ్యాంగ రాద్ధాంతానికి దారి తీస్తుంది. అది ఎవరికీ మంచిదికాదు. ఇదే అభిప్రాయాన్ని సుప్రీం కోర్టు విడమరిచి చెప్పింది. గవర్నర్ బిల్లును పునః పరిశీలనకు వెనక్కి పంపాక, తిరిగి అసెంబ్లీ ఆమోదించిన తర్వాత, రెండోసారి ఆ బిల్లులను రాష్ట్రపతి సిఫార్సు కోసం గవర్నర్ పంపకూడదని, అలా చేస్తే చట్టవిరుద్ధమవుతుందని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. అంతేకాదు అసెంబ్లీ రెండోసారి ఆమోదించిన బిల్లులు గవర్నర్ ఆమోదం పొందినట్టుగానే పరిగణించాలని గుర్తుచేసింది. ఒకవేళ రాష్ట్రపతికి నివేదించాలనుకుంటే నెలరోజుల్లోపే గవర్నర్ దానిపై నిర్ణయం తీసుకోవాలని సుప్రీం కోర్టు సూచించింది. రాష్ట్రపతికి సిఫార్సు అవసరం లేదనుకుంటే మూడు నెలల్లోపే బిల్లులపై నిర్ణయం తీసుకోవాలని, అంతేకానీ శాశ్వతంగా వాటిని తమ వద్ద ఉంచుకోలేరని సుప్రీం కోర్టు తన తీర్పులో పేర్కొంది.రాజ్యాంగానికి, ప్రభుత్వ విధానాలకు, జాతీయ ప్రాముఖ్యత కలిగిన అంశాలకు విరుద్ధంగా ఉందని భావిస్తే ఆ బిల్లును రాష్ట్రపతి పరిశీలనకు రిజర్వు చేయవచ్చు. ఇంత స్పష్టంగా గవర్నర్ బాధ్యతల గురించి సుప్రీం కోర్టు ప్రస్తావించడం ఇదే మొదటిసారి. ఇది ఒక్క తమిళనాడు గవర్నర్‌కే అని అనుకోరాదు. రాజ్యాంగ విధులను విస్మరించిన గవర్నర్లు ఎవరైతే ఉంటారో వారందరికీ ఇది కనువిప్పు అవుతుంది. దీన్ని బట్టి శాసనసభ తీర్మానమే పైచేయి అవుతుంది తప్ప గవర్నర్ నిర్ణయం కాదు. గవర్నర్ పాత్ర మొక్కుబడే తప్ప శాసనసభను శాసించే పరిస్థితి ఉండదు. ఇక్కడ తమిళనాడు గవర్నర్ తన వద్దకు వచ్చిన 10 బిల్లుల గురించి ఎలాంటి సమాధానం ఇవ్వకుండా తన వద్దే ఉంచుకున్నారని తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టు ను ఆశ్రయించడంతోనే గవర్నర్ వైఖరి బయటపడింది. ఇప్పుడే గత కొంతకాలంగా తమిళనాడు ప్రభుత్వానికి, గవర్నర్ రవికి మధ్య ఘర్షణ వాతావరణం నెలకొందన్న సంగతి సుప్రీం కోర్టు ఇది వరకే గ్రహించింది.తమిళనాడు ప్రభుత్వానికి, గవర్నర్‌కు మధ్య విభేదాలు తలెత్తి ప్రతిష్టంభన ఏర్పడగా సుప్రీం కోర్టు జోక్యం చేసుకుని గట్టిగా మందలించింది.అంతేకాదు తమిళనాడు అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం కూడా వివాదాలకు దారి తీసింది. ప్రభుత్వం అందజేసిన ప్రసంగం చదవకుండా గవర్నర్ స్వంతంగా ప్రసంగించారని ముఖ్యమంత్రి స్టాలిన్, మంత్రిమండలి ధ్వజమెత్తిన సంఘటన ఇంకా ఎవరూ మర్చిపోలేదు. అలాగే జాతీయ గీతం ఆలపించకుండా ద్రవిడ సంప్రదాయ గీతాన్ని ఆలపించారని గవర్నర్ కోపంతో సభనుంచి అర్ధంతరంగా నిష్క్రమించడం గవర్నర్ దుందుడుకు చర్యగా విమర్శలకు దారితీసింది. ఇలాంటి పరిస్థితి కొనసాగుతున్నా, సుప్రీం కోర్టు ధర్మాసనం గట్టిగా మందలించినా గవర్నర్ వైఖరిలో మార్పు రాకపోవడం చర్చకు దారి తీస్తుంది. గవర్నర్ అంటే ఒక రాష్ట్రానికి రాజ్యాంగ అధిపతి. కేంద్ర స్థాయిలో భారత రాష్ట్రపతికి ఉన్న అధికారాలు, విధులు రాష్ట్ర స్థాయిలో గవర్నర్‌కు ఉంటాయి.రాజ్యాంగ అధిపతిగా గవర్నర్ ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి, మంత్రిమండలి సలహా ఆధారంగా అన్ని నిర్ణయాలు తీసుకోవడం రాజ్యాంగ విధి. అయితే కేంద్రంలోను, రాష్ట్రాల్లోనూ వివిధ రాజకీయ వ్యవస్థలు పాలించడం ప్రారంభం కావడంతో రాజ్యాంగ పరంగా అనుసరించాల్సిన విధానాలు గాడి తప్పుతున్నాయి. అయితే కొందరు తాము 1935 నాటి భారత ప్రభుత్వ చట్టం ప్రకారం నియామకమైన ప్రభుత్వ ప్రతినిధులుగా వ్యవహరిస్తుంటారు. ఆ చట్టం ప్రకారం బ్రిటిష్ ప్రభుత్వం ఆనాడు గవర్నర్లకు విపరీతమైన అధికారాలను కట్టబెట్టింది. బ్రిటిష్ ప్రభుత్వ ఏజెంట్లుగా అప్పటి గవర్నర్లు వ్యవహరించేవారు. 2014లో కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి ఇటువంటి దృశ్యాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. అంటే గవర్నర్లు కేంద్రానికి ఏజెంట్లా? కేంద్ర ప్రభుత్వంచే నియమించబడిన గవర్నర్లు ప్రజలకు జవాబుదారీ అవుతారా? అలాగే వారికి శాసనాధికారాలు ఉంటాయా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

# అత్య ప్రచారాలుగా కొట్టి పారేసిన టిటిడి

తిరుమల, గోశాలలో ఇటీవల గోవులు మృతి చెందాయంటూ కొద్దిమంది సోషల్ మీడియాలో చేస్తున్న ప్రచారం వాస్తవం కాదని టిటిడి ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. మృతి చెందిన గోవుల ఫొటోలు అంటూ సోషల్ మీడియాలో వైరల్ అవుతోన్న ఫొటోలు అసలు గోశాలకు సంబంధించినవి కావు, దురుద్దేశంతో కొద్ది మంది మృతి చెందిన గోవుల ఫొటోలను టిటిడి గోశాలలో మృతి చెందినవిగా చూపించి.. భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా చేస్తున్న ప్రచారం అని కొట్టిపారేసింది.. గోవుల చనిపోయా యంటూ చేస్తున్న ప్రచారాన్ని ఖండించిన టిటిడి, ఇలాంటి అవాస్తవ ప్రచారాన్ని నమ్మవద్దని విజ్ఞప్తి చేసింది.. టిటిడి ముఖ్య ప్రజా సంబంధాల అధికారిచే ఈ ప్రకటన విడుదల చేసింది. తిరుమల తిరుపతి దేవస్థానం నకు చెందిన గోశాలలో గోవులు మృతిచెందాయంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి.. ఇక, ఈ వ్యవహారంపై టిటిడి మాజీ చైర్మన్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత భూమన కరుణాకర్‌రెడ్డి.. ఆరోపణలు గుప్పించారు.. హిందూ ధర్మ పరిరక్షణ ధ్యేయం అంటున్న ఎన్డీఏ ప్రభుత్వంలో వందకు పైగా గోవులు చనిపోయాయని ఆవేదన వ్యక్తం చేసిన ఆయన.. స్వీ గోశాలలో గత మూడు నెలలుగా వందకుపైగా ఆవులు చనిపోతున్నా.. పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.. అయితే, ఎస్వీ గోశాలలో గోవులు మృతిచెందాయంటూ జరుగుతోన్న ప్రచారంపై స్పందించిన టిటిడి గోశాలలో గోవులు మృతి చెందాయంటూ వస్తున్న వార్తలు అవాస్తవం అని కొట్టిపారేసింది..

# భారత్ అప్రమత్తంగానే ఉందన్న జైశంకర్

న్యూఢిల్లీ, అగ్రరాజ్యం అమెరికా, చైనా మధ్య వాణిజ్య యుద్ధం కొనసాగుతుంది. దీంతో ప్రపంచం తీవ్ర గందరగోళానికి గురైతుంది. ఇక, ఈ వివాదంపై న్యూఢిల్లీలో జరిగిన కార్నెగీ ఇండియా గ్లోబల్ టెక్నాలజీ సమ్మిట్‌లో భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ మాట్లాడుతూ.. భారతదేశం తన ప్రయోజనాలను కాపాడుకోవడానికి సిద్ధంగా ఉందని అన్నారు. రెండు అతి పెద్ద ప్రపంచ ఆర్థిక వ్యవస్థల మధ్య వాణిజ్య పరంగా నువ్వానేనా అన్నట్లుగా సుంకాల యుద్ధం సాగుతోందన్నారు. జనవరి 20వ తేదీన డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగాఅధికారం చేపట్టిన వెంటనే ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కోసం వాషింగ్టన్‌తో చర్చలను వేగవంతం చేశామని కేంద్రమంత్రి జైశంకర్ అన్నారు. కానీ, ట్రంప్ తన మొదటి పదవీకాలం సమయంలో వాణిజ్య ఒప్పందం కార్యరూపం దాల్చక పోవడంతో ఇండో– అమెరికా వాణిజ్య విధానంపై తీవ్రమవుతున్న అనిశ్చితి నెలకొందన్నారు. కాగా, ఇప్పుడు మాత్రం ఆ ఒప్పందాన్ని ఖరారు చేయడానికి ప్రయత్నిస్తోందని తేల్చి చెప్పారు. అయితే, ప్రస్తుతం అమెరికాలో ఆందోళనకర వాతావరణం నెలకొనడంతో.. చర్చల్లో వేగం తగ్గిపోయిందన్నారు. అయితే, యుఎస్–చైనా మధ్య సంబంధాలు చాలా భిన్నంగా ఉన్నాయని చెప్పుకొచ్చారు. ఇక, 1947లో భారత్ కి స్వాతంత్ర్యం÷–ర వచ్చిన తర్వాత అమెరికా– చైనా మధ్య తీవ్రమైన పోటీ– ఉండేది.. ఆ పోటీ–లో మేము చిక్కుకు పోయామన్నారు.. కాగా, ఇరు దేశాల మధ్య కొనసాగుతున్నది వాణిజ్యం, రాజకీయం, రక్షణ సమస్య కాదు.. ఇది చాలా సున్నితమైన అంశమని భారత విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ వెల్లడించారు.

# నదిలో కుప్పకూలిన హెలికాప్టర్

న్యూయార్క్, అమెరికాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. న్యూయార్క్‌లో ఓ పర్యటక హెలికాప్టర్ ప్రమాదవశాత్తూ నదిలో కుప్పకూలిన ఘటనలో ఓ టెక్ కంపెనీ సీఈఓ, ఆయన కుటుంబం దుర్మరణం పాలయ్యింది. అమెరికా కాలమానం ప్రకారం గురువారం మధ్యాహ్నాం ఈ ఘటన చోటు–చేసుకుంది. ఈ ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఈ ఘటనపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. జర్మనీకి చెందిన దిగ్గజ సీమెన్స్ కంపెనీ స్పెయిన్ విభాగ అధిపతి, సీఈఓ అగస్టన్ ఎస్కోబార్ తన కుటుంబంతో కలిసి న్యూయార్క్ పర్యటనకు వచ్చారు. వీరు ప్రయాణిస్తున్న హెలికాప్టర్ హడ్సన్ నది మీదుగా వెళ్తున్న సమయంలో ప్రమాదానికి గురైంది. గింగిరాలు తిరుగుతూ నదిలో తలకిందులుగా పడిపోయింది. అనంతరం మంటలు చెలరేగడంతో హెలికాప్టర్‌లో ఉన్న ఆరుగురు మృతి చెందారు. వీరిలో ఎస్కోబార్, ఆయన భార్య, ముగ్గురు పిల్లలతో పాటు పైలట్ కూడా ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు. ప్రమాదానికి గురైన బెల్ 206 చాపర్‌ను న్యూయార్క్ హెలికాప్టర్ టూర్స్ విభాగం సైట్ సీయింగ్ కోసం వినియోగిస్తోంది. సమాచారం అందుకున్న రెస్క్యూ సిబ్బంది ఘటనా స్థలంలో బోట్ల సాయంతో సహాయక చర్యలు చేపట్టారు. హెలికాప్టర్ తలకిందులుగా పూర్తిగా నీళ్లలో కూరుకుపోయిం దని వెల్లడించారు. గాల్లో ఉండగానే హెలికాప్టర్‌లోని ఒక భాగం విరిగిపోయిందని అధికారులు పేర్కొన్నారు.

# రంగంలోకి ఈడీ..

హైదరాబాద్,గ్యాంగ్‌స్టర్ నయీమ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. నయీమ్ కేసులో ఎన్ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ రంగంలోకి దిగనుంది. నయీమ్ పెద్ద మొత్తంలో అక్రమ ఆస్తులను కూడబెట్టినట్లు అధికారులు గుర్తించారు. పలువురు రాజకీయ నేతలు, వ్యాపారులకు నయీమ్ బినామీగా ఉండి.. వారి లావాదేవీలకు అండగా ఉండి డబ్బుల తరలింపుకు పాల్పడ్డట్లు గుర్తించారు. కాగా 2016, ఆగష్టులో తెలంగాణ పోలీసులు ఎన్‌కౌంటర్‌లో హతం అయ్యాడు నయీమ్.. ఇక, నయీమ్ ఎన్‌కౌంటర్ తర్వాత పెద్ద మొత్తంలో ఆస్తులు వెలుగులోకి వచ్చాయి. నయీమ్‌తోపాటు అతడి భార్యాపిల్లలు, బావమరిది, బినామీల పేరుతో పెద్ద ఎత్తున ఆస్తులను గుర్తించారు. ఈ నేపథ్యంలో ఈడీ అధికారులు నయీమ్ పై మనీలాండరింగ్ కేసు నమోదు చేశారు. తాజాగా ఈడీ చర్యలు ప్రారంభించింది.నయీమ్ కు సంబంధించిన 35 ఆస్తులు జప్తు చేసేందుకు ఈడి చర్యలు చేపట్టింది. 35 ఆస్తులను నయీమ్ కుటుంబ సభ్యులు, సన్నిహితుల పేర్ల మీద రిజిస్ట్రేషన్ చేసినట్లు ఈడి గుర్తింపు.. అక్రమంగా , బలవంతంగా ఈ ఆస్తులను నయీమ్ తమ కుటుంబ సభ్యుల పేర్ల మీద రిజిస్టర్ చేసుకున్నట్టు గుర్తింపు.. 2022 మార్చిలో నయీమ్ ఆస్తులపై మనీ లాండరింగ్ కేసు నమోదు చేసిన ఈడి.. అప్పటి ఐటీ అధికారులు, సిట్ సమాచారంతో ECIR నమోదు చేసిన ఈడి.. ఆస్తులు మొత్తాన్ని నయీమ్ కుటుంబ సభ్యులు హసీనా బేగం ,తహీరా బేగం, సలీమా బేగం, అబ్దుల్ సలీం, అహేలాబేగం, సయ్యద్ నిలోఫర్ ,ఫిర్దోస్ అంజూమ్, మహమ్మద్ ఆరిఫ్ ,హసీనా కౌసర్ పేర్ల మీద రిజిస్టర్ చేసినట్లు ఈడి గుర్తింపు.వీరి పేర్లను నమోదు చేసిన ఈడి.. పలుమార్లు ఈడి సమన్లు పంపిన స్పందించని కుటుంబ సభ్యులు..

# రామరాజ్యం కోసం కృషి చేస్తున్నా

కడప,ఒంటిమిట్టలో సీతారాముల కల్యాణం కన్నులు పండుగ జరిగిందని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ఒంటిమిట్ట కోదండరాముని కల్యాణోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దంపతులు పాల్గొన్నారు. స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. వేదికపై నుంచి సీతారాముల కల్యాణం తిలకించారు. అనంతరం వేడుకను ఉద్దేశించి ప్రసంగించారు. పరిపాలన అంటే రామ పాలన జరగాలని అందరూ కోరుకుంటారన్నారు. తండ్రి మాటకు కట్టుబడి వనవాసం వెళ్లారు.. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత ఒంటిమిట్ట లో జరుపుకుంటున్నాము. వెంకటేశ్వర స్వామి కనుసన్నల్లోనే జరగాలని కోరుకున్నాం.. ఒకే శిలపై సీతారాముల తో పాటు లక్ష్మణ విగ్రహాలు ఉన్నాయి. తిరుపతి నుంచి ఒంటిమిట్ట వచ్చే సర్క్యూట్ ను అభివృద్ధి చేయాలి. కొండలపై ఆయుర్వేద మొక్కలు నాటాలి. టెంపుల్ టూరిజం అభివృద్ధి చేస్తాం. టూరిజం హబ్ గా అభివృద్ధి చేస్తాం. దేవాలయాలు లేకుంటే కుటుంబ వ్యవస్థ ఉండేది కాదు. ప్రపంచంలో ఇటువంటి వ్యవస్థ లేదని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. రామరాజ్యం తేవడమే నా ఆకాంక్ష అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. శ్రీరాముని సాక్షిగా రాష్ట్రం ప్రతిఒక్కరికి న్యాయం చేస్తానని.. భారత దేశం ప్రధాని నాయకత్వంలో రామరాజ్యం గా అభివృద్ధి చెందుతుందన్నారు. రామరాజ్యం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. శ్రీరాముని స్ఫూర్తి గా తీసుకుని ప్రతిఒక్కరు పేదలకు అండగా నిలవాలని.. సాటి మానవుడు కూడా బాగుండాలని అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.. రాత్రికి ఒంటిమిట్ట లోని టీటీడీ గెస్ట్ హౌస్ లో సీఎం బస చేయనున్నారు. ఇదిలావుంటే వైఎస్సార్ కడప జిల్లా ఒంటిమిట్టలో శ్రీకోదండరామస్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు ఒంటిమిట్టకు చేరుకొని రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామివారికి పట్టు-వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. స్వామివారి కల్యాణం చూసేందుకు భారీ సంఖ్యలో భక్తులు ఒంటిమిట్టకు చేరుకున్నారు. కల్యాణోత్సవం నిర్వహణకు తితిదే, జిల్లా యంత్రాంగం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసింది. 52 ఎకరాల విస్తీర్ణంలో కల్యాణ వేదికను ఏర్పాటు చేశారు. ఈ వేదికకు ఎదురుగా రెండు వైపులా భక్తులు కూర్చోవడానికి 147 గ్యాలరీలు సిద్ధం చేశారు. భక్తులు కల్యాణాన్ని వీక్షించేందుకు 13 భారీ ఎల్ఈడీ తెరలు అమర్చారు. విజయవాడ నుంచి నేరుగా కడప ఎయిర్ పోర్ట్‌కు చేరుకున్న సీఎం చంద్రబాబు దంపతులు రోడ్డు మార్గంలో ఒంటిమిట్ట చేరుకున్నారు. అనంతరం స్వామి వారికి పట్టు- వస్త్రాలు సమర్పించారు. ఆ తర్వాత స్వామి వారి ప్రసాదాన్ని సీఎం చంద్రబాబు దంపతులకు అందజేశారు. అనంతరం సీఎం చంద్రబాబు దంపతులను వేద పండితుల ఆశీర్వాదించారు.

# క్లీన్ పాలిటిక్స్.. ఇదికదా చంద్రబాబు అంటే..



విజయవాడ: ఐదేళ్ల వైసీపీ పాలన ఎంత అధ్వాన్నంగా సాగిందో అందరూ చూశారు. పాలనలో అడుగడుగునా అక్రమాలు. చంద్రబాబును సైతం జైల్లో పెట్టిన దుర్మార్గం. ఇక వైసీపీ సోషల్ మీడియా చేసిన అరాచకాలు అన్నీఇన్నీ కావు. పవన్ కల్యాణ్ కూతురు మీద కూడా దారుణమైన పోస్టులు పెట్టిన పైశాచికత్వం. టీడీపీ, జనసేన నాయకులను ఎవరినీ వదిలిపెట్టలేదు. మహిళా నేతలపై అమానుష మాటల దాడి జరిగింది. శ్రీరెడ్డిని ఎగదోశారు. సభ్యసమాజం సహించలేని భాష వాడారు. బూతులు, తిట్లు.. అబ్బో చెవులు, కళ్లు మూసుకోవాల్సిందే. ఆనాడు అంతలా రెచ్చిపోయింది బ్లూ సోషల్ మీడియా. నిండు అసెంబ్లీలో నారా భువనేశ్వరి మీదే కారు కూతలు కూశారు. చంద్రబాబుతో కన్నీళ్లు పెట్టించారు. కట్ చేస్తే.. ఆ పాపాలన్నీ పండి జగన్ ప్రభుత్వం పడిపోయింది. కూటమి సర్కారు కొలువదీరాక.. రివేంజ్ పాలిటిక్స్ నడుస్తాయేమోనని కొందరు అనుకున్నారు. బూతుకు బూతు.. తిట్టుకు తిట్టు.. సోషల్ మీడియాలో రచ్చ చేస్తారని భావించారు. కానీ, అలా జరగడం లేదు. జగన్‌కు, చంద్రబాబుకు ఉన్న తేడా అదే మరి అంటున్నారు.

గీత దాటితే వేటే..

చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు ముందే చెప్పారు. మహిళలను కించపరిచేలా ఎవరు మాట్లాడినా సహించేది లేదని ముందే తేల్చి చెప్పారు. అలాంటి చీప్ పాలిటిక్స్ చేయొద్దని కేడర్‌ను ముందే హెచ్చరించారు. అన్నట్టుగానే.. ఇప్పుడు టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు హద్దు దాటిన కార్యకర్తపై వేటు వేశారు.

క్లీన్ పాలిటిక్స్.. చంద్రబాబు మార్క్

వైఎస్ భారతిపై అసభ్యకర కామెట్స్ చేసిన ITDP కార్యకర్త చేబ్రోలు కిరణ్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేయడం చంద్రబాబు మార్క్ క్లీన్ పాలిటిక్స్‌కు నిదర్శనం అంటున్నారు. కిరణ్‌పై కేసు నమోదు చేసి, వెంటనే అరెస్ట్ చేయించారు. చంద్రబాబు తీరు ఇలా ఉంటుంది మరి. తమ పార్టీ వాడే కదాని ఏమాత్రం ఉపేక్షించలేదు. క్షణం కూడా ఆలోచించలేదు. తప్పు తప్పే. వైఎస్ భారతిని కించపరిచేలా అసభ్యంగా మాట్లాడటం ముమ్మాటికీ క్షమించరాని నేరమని సీరియస్ అయ్యారు. చేసిన తప్పు తెలుసుకుని కిరణ్ క్షమాపణలు కోరినా.. నో యూజ్.

దటీజ్ బాబు.. ఎనీ డౌట్స్?

నోటికొచ్చినట్టు ఎవరు వాగినా వదిలిపెట్టేది లేదని చంద్రబాబు క్లియర్ కట్‌గా చెబుతున్నారు. వైసీపీ హయాంలో రెచ్చిపోయిన బోరుగడ్డ అనిల్‌కు చిప్పకూడు తప్పలేదు. ఇష్టం వచ్చినట్టు నోరు పారేసుకున్న పోసానితో జైలు ఊచలు లెక్కబెట్టించారు. వల్లభనేని వంశీని లోపలేశారు. కొడాలి, జోగి, పేర్ని, రోజాలకు ముహూర్తం పెట్టేశారు. ఆర్జీవీనీ వదిలేదేలే అంటున్నారు. ఇలా గతంలో ఓవరాక్షన్ చేసిన అందరిపై యాక్షన్ నడుస్తోంది. వైసీపీ వాళ్లపై మాత్రమే కేసులు ఉంటాయని అనుకోటానికి లేదు. తాజా ఘటనలో టీడీపీ కార్యకర్త చేబ్రోలు కిరణ్‌పైనా కేసు నమోదు అవుతోందంటే.. ఇలాంటి విషయాలపై చంద్రబాబు ఎంత సీరియస్‌గా ఉన్నారో తెలుస్తోంది. రాజకీయాల్లో విమర్శలు, ప్రతివిమర్శలు కామనే. ఆరోపణల వరకూ ఓకే. కానీ, ఇందులోకి మహిళలను లాగితే..? నోటికొచ్చినట్టు వాగితే..? తిట్టితే? బూతులు మాట్లాడితే..? తాట తీసుడే. అది ఎవరైనా. ప్రతిపక్షమైనా, స్వపక్షమైనా. దటీజ్ చంద్రబాబు. ఎనీ డౌట్స్?

# గోదావరి-బనకచర్లపై ముందుకెళ్లకుండా చూడండి

హైదరాబాద్, గోదావరి-బనకచర్లపై ఏపీ ముందుకెళ్లకుండా చూడాలని గోదావరి నదీ యాజమాన్య బోర్డుకు తెలంగాణ నీటిపారుదలశాఖ ఈఎన్సీ కార్యాలయం లేఖ రాసింది. పోలవరం ప్రాజెక్టు, తాడిపూడి ఎత్తిపోతలపై ఎలాంటి టెండర్లు చేపట్టకుండా చూడాలని కోరింది. ఈ నెల 7న జరిగిన సమావేశంలోనూ ఇదే అంశాన్ని ప్రస్తావించామని పేర్కొంది.. గోదావరి-బనకచర్ల ప్రతిపాదన ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని జీఆర్ఎంబీ ఛైర్మన్, ఏపీ సభ్యులు సమాధానం ఇచ్చారు. కానీ, మరుసటి రోజే ఏపీ జలహారతి కార్పొరేషన్ ఏర్పాటు చేసింది.

# అత్యాచార నిందితుడికి 25 ఏళ్ల జైలు

హైదరాబాద్,నాంపల్లి లోని పోక్సో కోర్టు శుక్రవారం సంచలన తీర్పుని వెలువరించింది. 2023లో రాజ్‌భవన్ మక్త ప్రాంతంలో మైనర్ బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడిన నిందితుడు శ్రీనివాస్‌కు కోర్టు 25 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. ఈ కేసు తీర్పు ప్రకటనతో బాధిత కుటుంబానికి న్యాయం లభించిందన్న భావన నెలకొంది. 2023లో శ్రీనివాస్ అనే వ్యక్తి మైనర్ బాలికను సెల్‌ఫోన్ ఇస్తానని మాయ మాటలతో మభ్యపెట్టి తన ఇంటికి తీసుకెళ్లాడు. అనంతరం బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. బాలిక ప్రాణాలతో బయటపడిన తర్వాత, తల్లిదండ్రులు వెంటనే నాంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు. కేసు విచారణ సమయంలో కోర్టుకు అందిన ఆధారాలు, బాలిక ధైర్యంగా ఇచ్చిన వాంగ్మూలం, వైద్య నివేదికలు అన్నీ నిందితుడిపై అభియోగాలను నిరూపించాయి. పోక్సో చట్టం కింద ఈ కేసును విచారించిన నాంపల్లి ప్రత్యేక కోర్టు, నేరం నిరూపితమైందని తేల్చి, శ్రీనివాస్‌కు 25 ఏళ్ల జైలు శిక్ష విధించింది. అంతేకాకుండా, నిందితుడిపై జరిమానా కూడా విధించింది. ఈ తీర్పుతో మైనర్ బాలికలపై హింసను తట్టు-కోలేని స్థితిలో ఉన్న కుటుంబాలకు ఒక ధైర్యం లభించినట్లయిందని అనేకమంది న్యాయవాదులు అభిప్రాయపడ్డారు.

# నిజమెంతో?

విజయవాడ:టీడీపీలోనూ, కూటమి ప్రభుత్వంలోనూ పేరుకు సీఎం చంద్రబాబునాయుడిది పెద్దరికం. కానీ పెత్తనం అంతా బాబు తనయుడు, మంత్రి నారా లోకేశ్‌దే. ఇది జగమెరిగిన సత్యం. టీడీపీ భవిష్యత్ రథసారథి ఆయనే కావడంతో సహజంగానే, లోకేశ్ జోక్యం ఎక్కువగా వుంటోంది. రాజకీయాల్లో మంచి జరిగితే అంతా లోకేశ్ గొప్ప అంటారు. లేదంటే రాళ్లు వేయించుకోడానికి సిద్ధంగా వుండాలి.కూటమి పాలన పది నెలలు పూర్తి వచ్చింది. మరో రెండు రోజుల్లో 11వ నెలలో అడుగు పెట్టబోతోంది. అయితే అనూహ్యంగా కూటమి పాలనపై నెగెటివ్ టాక్ వినిపిస్తోంది. మీడియా బలంతో ఇంకా వైఎస్ జగన్ దుర్మార్గ పాలన అంటూ ప్రచారం చేస్తున్నారు. కానీ ప్రజలపై ఆ ప్రచారం పని చేయడం లేదు. ప్రస్తుతం అధికారంలో ఉన్నోళ్లు ఏమీ చేయడం లేదనే ఆవేదన, ఆగ్రహం ప్రజానీకంలో వుంది.మరీ ముఖ్యంగా టీడీపీలో సీనియర్ నేతలను దాదాపు పక్కన పెట్టేశారు. లోకేశ్ టీమ్ అధికారాన్ని చెలాయిస్తోంది. పోనీ, వాళ్లేమైనా కాస్త పలుకుబడి, పెద్దరికం ఉన్నోళ్లా? అంటే%ొ% అంత సీన్ లేదనే సమాధానం వస్తోంది. ఉదాహరణకు తిరుపతి జిల్లానే తీసుకుందాం. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి హవా కొనసాగిస్తున్నారు. ఆయనపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అయినప్పటికీ ఆయనపై ఎలాంటి చర్యలు లేవు.ఆఫ్ ది రికార్డ్‌గా బొజ్జల సుధీర్‌రెడ్డి తన సంపాదనలో లోకేశ్‌కు కొంత ఇస్తున్నట్టు చెబుతున్నారని సమాచారం. అందుకే సుధీర్‌పై ఈగ వాలనివ్వకుండా లోకేశ్ అడ్డుకుంటున్నారని ఆ పార్టీకి చెందిన సీనియర్ నాయకులే చెబుతున్నారు. అలాగే లోకేశ్ చుట్టూ ఉన్న టీమ్ సభ్యుల్ని గమనిస్తే, లాబీయిస్టులకు పెద్దపీట. లాబీయిస్టులంటే ఏం చేస్తారో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.ఆదాయ వనరుల్ని లోకేశ్‌కు సమీకరించడానికి బలమైన నెట్‌వర్క్ పని చేస్తోందనే విమర్శ టీడీపీ వర్గాల నుంచే వస్తోంది. డబ్బులిస్తే, ఈ ప్రభుత్వంలో ఏ పనైనా జరుగుతుందనే మాట టీడీపీ నాయకుల నుంచే వస్తోంది. “పార్టీ కోసం ఎంత కష్టపడితే ఏం లాభం. యువ నాయకుడికి ముట్టచెప్పడానికి మా దగ్గర ఏమీ లేదు. ఫలానా కార్పొరేషన్ పదవికి ఇన్ని కోట్లు అడుగుతున్నారు” అని టీడీపీ నాయకులు వాపోతున్నారు. రాజకీయాల్లో ప్రచారం జరుగుతున్నంతగా అవినీతి లేకపోవచ్చు. కానీ నిప్పులేనిదే పొగ రాదనే నానుడిని కొట్టి పారేయలేని పరిస్థితి.ప్రధానంగా టీడీపీ కేడర్‌లో తీవ్ర అసంతృప్తి రావడానికి, గతంలో మాదిరి పనిచేసే వాళ్లకు పదవులు దక్కకపోవడమే అని సీనియర్ నేతలు అంటున్నారు. డబ్బుకు లోకం దాసోహం అనే మాటలో లోకం అనే పదానికి బదులు తమ నాయకుడి పేరు మార్చుకుంటే సరిపోతుందనే టీడీపీ నాయకుల ఆవేదన, ఆగ్రహంలో నిజమెంతో ఆ పరమాత్ముడికే తెలియాలి. కానీ క్షేత్రస్థాయిలో ఇలాంటి అభిప్రాయం, విమర్శల్ని టీడీపీ అధిష్టానం పరిగణలోకి తీసుకోవాల్సిన అవసరం వుంది.

# ఐఎస్ఐ ప్రమేయం..

ముంబై:26/11 ముంబై ఉగ్రదాడుల కీలక కుట్రదారు, ఉగ్రవాది అయిన పాక్-కెనెడియన్ తహవూర్ రాణాని భారత అధికారులు గురువారం అమెరికా నుంచి ఇండియాకు తీసుకువచ్చారు.అమెరికా న్యాయస్థానాల్లో భారత్‌కి అప్పగించకుండా ఉండేందుకు అన్ని న్యాయ సదుపాయాలను రాణా ఉపయోగించుకున్నాడు. అయితే, ఈ కేసులో అక్కడి న్యాయస్థానాలు ఉగ్రవాది రాణాని భారత్‌కి అప్పగించింది. గురువారం, న్యూఢిల్లీలో దిగిన వెంటనే, అధికారికంగా ఎన్ఐఏ అరెస్ట్ చేసి, పాటియాలా కోర్టుకు తరలించింది. 18 రోజుల కస్టడీ విధించింది. అయితే, ముంబై ఉగ్రదాడుల కేసులో పాకిస్తాన్ గూఢచార సంస్థ ఇంటర్-సర్వీసెస్ ఇంటెలిజెన్స్ పాత్ర ఉందని ఆరోపించబడిన విషయం మరోసారి వెలుగులోకి వచ్చింది. ఈ కుట్రలో ఇద్దరు పాకిస్తాన్ ఆర్మీ అధికారుల ప్రమేయం ఉంది. వీరిని మేజర్ ఇక్బార్, మేజర్ సమీర్ అలీ ఎన్ఐఏ మోస్ట్ వాంటెడ్ జాబితాలో ఉన్నారు. ఎన్ఐఏ వర్గాల ప్రకారం, వీరిద్దరితో రాణాకి ఉన్న సంబంధాలపై విచారించనున్నారు. ఐఎస్ఐ అధికారిగా పనిచేస్తున్న మేజర్ ఇక్బాల్ కీలక సూత్రధారిగా ఉన్నాడు.పాకిస్తాన్ అమెరికన్ డబుల్ ఏజెంట్ డేవిడ్ కోల్మన్ హెడ్లీ ( దావూద్ సయీద్ గిలానీ) సేకరించిన నిఘా సమాచారం, ప్లాన్‌కి కావాల్సిన వివరాలను సేకరించడానికి కావాల్సిన ఆర్థిక సాయాన్ని అందించిన వ్యక్తిగా మేజర్ ఇక్బాల్ ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. మరణశిక్ష నుంచి తప్పించుకోవడానికి 2010లో హెడ్లీ నేరాన్ని అంగీకరించాడు. మేజర్ ఇక్బాల్ తన ప్రైమరీ హ్యాండ్లర్‌గా చెప్పాడు. 2011లో హెడ్లీ ఇచ్చిన సాక్ష్యంలో తాను “చౌదరీ ఖాన్” అనే వ్యక్తితో ఈమెయిల్స్ మార్పిడి చేసుకున్నట్లు తెలిపాడు. ఇది మేజర్ ఇక్బాల్ కి మారుపేరు.ఒక ఈమెయిల్‌లో హెడ్లీని ప్రాజెక్టులు, నిఘా పరికరాల గురించి మేజర్ ఇక్బాల్‌కి అప్‌డేట్ చేయాలనే ఆదేశాలు ఉన్నాయి. అమెరికా అభియోగ పత్రం మేజర్ ఇక్బాల్‌ని లష్కర్ దాడులకు ప్లాన్ చేసి, నిధులు సమకూర్చిన పాకిస్తాన్ వ్యక్తిగా అభివర్ణించింది. ఉగ్రవాదం, హత్యలకు సాయం చేసినందుకు అతడిపై అభియోగాలు నమోదయ్యాయి. ఇతడే లష్కరే తోయిబాకు నిధులు సమకూర్చినట్లు ఆరోపించారు.మేజర్ సమీర్ అలీ మరో ఐఎస్ఐకి చెందిన నిందితుడు. 26/11 హ్యాండ్లర్ జబియుద్దీన్ అన్సారీ (అలియాస్ అబు జుందాల్)ని ఢిల్లీ పోలీసులు 2012లో అరెస్ట్ చేశారు. ఇతడి ప్రకారం, సమీర్ అలీ కరాచీలోని మలిర్ కంటోన్మెంట్‌లోని మిలిటరీ ఏరియాలో ఏర్పాటు చేసిన లష్కరే తోయిబా కంట్రోల్ రూం నుంచి రియల్ టైమ్‌లో దాడుల్ని పర్యవేక్షించాడు. ముంబై దాడుల సమయంలో సమీర్ అలీ లష్కరే తోయిబా కమాండర్ జాకీ ఉర్ రెహ్మాన్ లఖ్వీకి ఆదేశాలు జారీ చేసినట్లు జుందాల్ తన వాంగ్మూలంలో పేర్కొన్నాడు.సమీర్ అలీ కోసం ఇంటర్ పోల్ రెడ్ కార్నర్ నోటీసులు జారీ

# మేమొచ్చాక...

హైదరాబాద్,అధికారంలో ఉన్నవారు కన్నూమిన్నూ కానకుండా ప్రవర్తించడం అనేది ఇవాల్టి రోజుల్లో సర్వసాధారణం అయిపోయింది. తమ చేతిలో పెత్తనం ఉన్నది కదా అని విశృంఖలంగా నిర్ణయాలు తీసుకోవడం రివాజు అయింది. అయితే.. రాజకీయ వ్యవస్థ దారి తప్పి వ్యవహరిస్తే.. వారి దూకుడుకు అడ్డుకట్ట వేయడానికి న్యాయవ్యవస్థ సహా అనేక వ్యవస్థలు ప్రపంచంలోనే ఎంతో పటిష్టమైన మన భారతీయ ప్రజాస్వామ్యంలో ఉన్నాయి. ‘ప్రభుత్వం చేస్తున్నది తప్పు’ అని అనిపిస్తే.. ఆ తప్పు జరగకుండా అడ్డుకోవడంపై విపక్షాలు దృష్టి పెట్టకుండా.. ‘మేమొచ్చాక..’ అలా చేస్తాం, ఇలా చేస్తాం అని బెదిరించడం ఇవాళ మామూలు అయిపోతోంది. టైం మిషిన్ లో ఆ పరిస్థితుల్ని వెనక్కు తీసుకువెళతాం అని హెచ్చరించడం జరుగుతోంది. ఈ విషయంలో పాలక- విపక్షాలకు తేడా ఉండడం లేదు. ఒకరు బెదిరించే వారైతే.. మరొకరు ఆ బెదిరింపుల్ని కూడా తమ రాజకీయానికి వాడుకునే వారే! ఇలాంటి పరిస్థితుల్లో రెండు తెలుగు రాష్ట్రాలు కూడా దారుణంగా పతనం దిశగా నడుస్తున్నాయనే భయం ఆలోచన పరుల్లో కలుగుతోంది. ఈ పెడపోకడల మీదనే..

ఆంధ్రప్రదేశ్ లో ఎన్డీయే కూటమి పార్టీలు అధికారంలో ఉన్నాయి. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రతిపక్షంగా పోరాడుతోంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తోంది. భారత రాష్ట్ర సమితి వారిని ఉక్కిరి బిక్కిరి చేసేస్తోంది. ఇలాంటి సమీకరణాలు అన్నింటినీ కాసేపు పక్కన పెట్టండి. ఎవరు పాలకులు%-% ఎవరు ప్రతిపక్షాలు అనే సంగతి కాసేపు మరచిపోండి. కథల్లాగా.. ముందుగా రెండు ఉదాహరణలు చెప్పుకుందాం.

ఉదాహరణ 1:ఒక ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. ‘పెట్టుబడి దారుల్ని ఆహ్వానిస్తున్నాం.. వారికి భూములిస్తాం.. రాయితీలిస్తాం.. రండి వ్యాపారం చేసుకోండి.. మావాళ్లకు ఉద్యోగాలివ్వండి చాలు’ అని ప్రకటించింది. ప్రతిపక్షం కూడా చాలా స్ట్రాంగుగానే ఉన్న పార్టీ. ‘ఈ పెట్టుబడుల వ్యవహారంలో అవినీతి జరుగుతోంది.. పాలకపక్షం అవినీతికి పాల్పడుతోంది.. ఈ ప్రభుత్వ పదవీకాలం ముగిసిన తర్వాత మళ్లీ మేమే అధికారంలోకి వస్తాం.. అప్పుడు మీకు ఇచ్చిన భూములన్నీ వెనక్కు లాక్కుంటాం.. మీ తాటతీస్తాం’ అని వారు ప్రకటించారనుకోండి. అప్పుడు ఆ పెట్టుబడిదారుడు ఏం చేస్తాడు.సాధారణంగా మనం పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రాడు%-% విపక్షాల వల్ల నష్టం జరుగుతుంది అని అనుకుంటాం. అది నిజమే. కానీ అలాంటి నిర్ణయానికి వచ్చే ముందు నిజమైన పెట్టుబడిదారుడు కొంత రీసెర్చి చేస్తాడు. విపక్షాలు ఇలా బెదిరిస్తున్నాయి గానీ.. నిజంగా అలా చేస్తారా? అని ట్రాక్ రికార్డు చెక్ చేస్తాడు. వారికి నిజంగానే అధికారంలోకి వచ్చేంత, పరిస్థితుల్ని తిరగరాసేంత బలం ఉన్నదా అనే సంగతి కూడా క్రాస్ చెక్ చేస్తాడు. విపక్షం అలాగే చేస్తుందని, ఎందుకంటే ఇప్పుడున్న పాలకపక్షం కూడా అదేరీతిలో గత ప్రభుత్వం చేసిన డీల్స్ ను వెనక్కు మళ్లిస్తున్నదని.. కాబట్టి వారు కూడా మళ్లీ ప్రతీకారం తీర్చుకుంటారని అతనికి అర్థమైందని అనుకోండి. అన్నీ బెదిరింపుల ప్రకారం కన్ఫర్మ్ అయితే.. అప్పుడిక ‘చేసేదేముంది.. పెట్టుబడులు పెట్టకుండా వెనక్కు తగ్గుతాడు’ అని మనం అనుకుంటాం.

నిజమే సాధారణ వ్యాపారవేత్త /పెట్టుబడిదారుడు అలాగే చేస్తాడు. కానీ తెలివైన వ్యాపారి చేసే పని అది కాదు. ఉన్న ప్రభుత్వం ఇచ్చే అన్ని రాయితీలను వాడుకుని వ్యాపారం ప్రారంభిస్తాడు. పొందగల ఎడ్వాంటేజీలన్నీ పుచ్చుకుంటాడు. ప్రభుత్వ పదవీకాలం ముగిసి, మరో పార్టీ వచ్చేలోగా.. తన పెట్టుబడికి మించిన లాభాలన్నీ గిట్టుబాటు అయ్యేలాగా వ్యాపారం ప్లాన్ చేసుకుంటాడు. ఒప్పందాలను తదనుగుణంగా తయారుచేసుకుంటాడు. ఒకవేళ ప్రభుత్వం మారితే.. బెదిరించినట్టుగా వేధిస్తే.. వ్యాపారాన్ని అక్కడితే వదిలేసి, ఉద్యోగులను గాలికొదిలేసి.. తను లాభాలు దండుకోవడం ఎటూ పూర్తయింది గనుక.. దుకాణం సర్దుకుని వెళ్లిపోతాడు. ప్రభుత్వం మారకపోతే.. తాను లాభాలు దండుకోవడాన్ని కంటిన్యూ చేస్తాడు. పెట్టుబడిదారులు సాధారణమైన వారైనా, తెలివైన వారైనా విస్తృత ప్రయోజనాల దృష్ట్యా చూసినప్పుడు.. రాష్ట్రానికి మాత్రం నష్టమే జరుగుతుంది.ఉదాహరణ 2:ఉన్నత స్థానంలో ఒక ప్రభుత్వోద్యోగి ఉన్నాడు. పోలీసు శాఖ కావొచ్చు, ఏ ఇతర కీలకమైన శాఖ అయినా కావొచ్చు. అధికారంలోకి వచ్చిన పార్టీ ఎలా చెబితే అలా పనిచేయక తప్పదు. ఆ మాటకొస్తే.. ఎవ్వరు అధికారంలోకి వచ్చినా.. తాము ఎలా చెబితే అలా పనిచేసే అధికారులు మాత్రమే కీలక స్థానాల్లో ఉంటారు. విపక్షానికి చేరువైన అధికార్లుగా ముద్రపడిన వారు లూప్ లైన్లలో కాలం వెళ్లదీస్తూ ఉంటారు. లేదా వారి మీద ఏదో ఒక నెపం మీద సస్పెన్షన్ వేటులు పడి ఉంటాయి. కీలక స్థానంలో ఒక అధికారి ఉన్నారు కదా.. మరి ఆయన మీద విపక్షానికి చెందిన వారు కారాలు మిరియాలు నూరుతూ ఉంటారు. అధికార పార్టీకి తొత్తుల్లాగా పనిచేస్తారా.. మీకు ఆత్మాభిమానం లేదా అని నానా బూతులు తిడుతుంటారు. ఆ అధికారులు తమకు కిట్టని పని చేసినప్పుడు గానీ.. తమను ఇబ్బంది పెట్టినప్పుడు గానీ.. విపక్ష నేతలు బెదిరింపుల్లో రెచ్చిపోతారు. ‘మళ్లీ అధికారంలోకి వచ్చేది మేమే. అప్పుడు మీరు సప్తసముద్రాల అవతల దాక్కుని ఉన్నా సరే వెతికి మిమ్మల్ని పట్టుకుని తీసుకువస్తాం. నడిబజార్లో మీ బట్టలూడదీయించి కొడతాం’ అని బెదిరిస్తారు. లేదా, ‘మీ జాతకాలన్నీ రెడ్ బుక్ లో రాస్తున్నా. మేం అధికారంలోకి రాగానే మీ భరతం పడతా.. మీ అంతు తేలుస్తా’ అని కూడా హెచ్చరించగలరు. చెప్పినట్టే అధికారం చేతులు మారితే అధికారుల్ని వేధించడం కూడా గ్యారంటీ అని అనేక దృష్టాంతాలు నిరూపిస్తుంటాయి కూడా!అలాంటి నేపథ్యంలో ఏ అధికారి అయినా ఏం చేస్తారు? కీలకమైన స్థానాల్లో ఉండాలంటే.. అధికార పార్టీకి కొమ్ముకాయక తప్పదు. అందుచేత.. విపక్ష నాయకులకు టార్గెట్ కాక కూడా తప్పదు. అధికారం చేతులు మారితే.. ఇక తన కెరీర్ శంకరగిరి మాన్యాలు పట్టిపోతుందనే తెలివిడి వారికి తప్పకుండా ఉంటుంది. అనివార్యమైన, గతిలేని పరిస్థితుల్లో వారు ఉంటారు. అలాంటప్పుడు ఆ అధికారి ఏం చేస్తారు? తన కెరీర్ కు ఇప్పుడు పదవిలో ఉన్న అయిదేళ్లు మాత్రమే ఆఖరి అవకాశం అని తెలిసినప్పుడు.. ఆ ప్రభుత్వ పదవీకాలం ముగిసేలోగా.. తన యావజ్జీవితానికి సంబంధించిన సంపాదన మొత్తం పూర్తి చేసేయాలని విచ్చలవిడిగా అవినీతికి పాల్పడడం ప్రారంభిస్తారు. ఎటూ అధికారం ఏదో ఒకనాటికి చేతులు మారక తప్పదు.. అలా జరిగితే.. తనకు జీతం తప్ప గీతం దక్కని అప్రాధాన్య పోస్టులే ఉంటాయనే క్లారిటీ వారికి ఉంటుంది. తత్ఫలితంగా.. అందిన ప్రతి అవకాశాన్ని వాడుకుంటూ ఎడా పెడా దోచుకోవడం మొదలు పెడతారు.ఇలా జరిగినప్పుడు కూడా నష్టం జరిగేది ఎవ్వరికి? రాష్ట్ర ప్రజలకే! అధికారుల దోపిడీకి, అవినీతికి బలయ్యేది ఎప్పుడూ కూడా ప్రజలే! అలాగే, నష్టం వాటిల్లేది ప్రభుత్వ ఖజానాకు మాత్రమే.

తెలుగు రాష్ట్రాల్లో ఉన్నది ఇలాంటి దుస్థితే!

తాజాగా హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీ గురించి నానా బీభత్సమైన రచ్చ జరుగుతోంది. ఏఐ రూపంలో టెక్నాలజీ కొత్త పుంతలు తొక్కుతున్న తరుణంలో ఏవి నిజాలో.. ఏవి అబద్ధాలో అర్థం కాని ఫోటోలు, వీడియోలతో విపరీతమైన అనుకూల, ప్రతికూల ప్రచారం జరుగుతూనే ఉంది. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ 400 ఎకరాలు ప్రభుత్వానిదే అని సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ భట్టి విక్రమార్క చెబుతారు. కాంగ్రెస్ ఏం మాయ చేసినా సరే.. అక్కడ స్థలాలు ఎవ్వరూ కొనవద్దని.. మరో మూడేళ్లలో తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే ఆ స్థలాలన్నీ వెనక్కు లాక్కుంటాం అని కేటీఆర్ హెచ్చరిస్తారు.అదే మాదిరిగా ఏపీ విషయానికి వస్తే.. విశాఖలో సాగర తీరంలో అత్యద్భుతమైన స్థలాన్ని కేవలం ఒక షాపింగ్ మాల్ కోసం లులు సంస్థకు ఇచ్చేసింది గతంలో చంద్రబాబు ప్రభుత్వం. జగన్ రాగానే దాన్ని వెనక్కు లాక్కున్నారు. ఇప్పుడు బాబు సర్కారు వచ్చాక మళ్లీ అదే స్థలాన్ని లులుకు ధారాదత్తం చేసింది. మళ్లీ తాము అధికారంలోకి రాగానే ఆ స్థలాన్ని వెనక్కు తీసుకుంటాం అని, అనుమతులు రద్దు చేస్తాం అని వైసీపీ నేతలు హెచ్చరిస్తున్నారు.ఇవి కేవలం ఉదాహరణలు మాత్రమే. ఇలాంటి వ్యవహారాలు రాష్ట్రాన్ని ఏదిశగా నడిపిస్తాయి? పెట్టుబడి దారులు రారు.. వచ్చినా ఎంత త్వరగా రాష్ట్రాన్ని దోచుకోగలం అని మాత్రమే ఆలోచిస్తుంటారు తప్ప.. పారిశ్రామికంగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్లేంత ఫోకస్ తో పనిచేయరు! రెండు రాష్ట్రాలను కూడా పతనం దిశగా నడిపించే ఇలాంటి రాజకీయ పోకడలు ఇప్పుడు శ్రుతిమించుతున్నాయి.అధికారుల్లో కూడా మనం పైన చెప్పుకున్న పరిస్థితే. కాంగ్రెస్, తెలుగుదేశం సర్కారులకు అనుకూలంగా పనిచేస్తున్న అధికారులందరికీ.. పరిస్థితుల్లో తేడా వస్తే తమ పరిస్థితి ఏంటో స్పష్టత ఉంది. వారు నిజాయితీగా ఎందుకు పనిచేస్తారు?

ఎడ్వాంటేజీగా మార్చుకుంటున్న ఏపీ సర్కార్..

నిజానికి ఏపీలో చిత్రమైన పరిస్థితి ఉన్నది. తెలంగాణలో కేటీఆర్ బెదిరిస్తున్నట్టుగా ఏపీలో విపక్షనేత జగన్మోహన్ రెడ్డి ఎలాంటి బెదిరింపులు చేయడం లేదు. సైలెంట్ గానే ఉన్నారు. కానీ.. వారి మీద అలాంటి నిందలు వేస్తూ ఎడ్వాంటేజీ



తీసుకోవాలని ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. నారా లోకేష్ మాటలను గమనిస్తే.. తమ ప్రభుత్వ చేతగానితనం ఎక్కడ బయటపడినా సరే.. దానిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మీద నెట్టేయడానికి వారు ప్రయత్నిస్తున్నారు. నారా లోకేష్ ఏం అంటున్నారంటే.. ‘మేం రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాం.. కానీ వైసీపీ నాయకులు ఆ పెట్టుబడులను అడ్డుకుంటున్నారు’ అని ఒక స్వీపింగ్ స్టేట్మెంట్ ఇచ్చేస్తున్నారు. దీనికి రుజువు ఏమిటి? వారు ఏ పెట్టుబడులు తీసుకురావడానికి ప్రయత్నిస్తుండగా.. వైసీపీ నాయకుల్లో ఎవరు ఏ రీతిగా అడ్డం పడ్డారో వారు ఆధారాలతో చెప్పగలరా? అలాంటి ప్రశ్న ఎదురైతే గనుక.. ‘మా వద్ద ఆధారాలున్నాయి.. సమయం వచ్చినప్పుడు బయటపెడతాం..’ అనే అత్యంత పేలవమైన చెత్త ప్రకటనతో నాయకులు బుకాయిస్తారు.వాస్తవంగా ఇలాంటి పరిస్థితి ఉంటే గనుక.. ఏ సంస్థ పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకురావడానికి తమ ప్రభుత్వం ఎంత కృషి చేసిందో ప్రజలకు చెప్పాలి. కృషి అనగా.. ఆ సంస్థ ప్రతినిధులను వారి ఆఫీసుకు వెళ్లి కలవడం శాలువాలు కప్పడం బొబ్బిలి వీణలను, వెంకటేశ్వరస్వామి బొమ్మలను, అరకు కాఫీ ప్యాకెట్లను గిఫ్టులు ఇవ్వడం, ఫోటోలు దిగి వచ్చేయడం కాదు. అంతకు మించి.. అడుగు ముందుకు పడిందని ప్రజలకు నిరూపించాలి.‘మేం కలిశాం.. ఆ సంస్థ మన రాష్ట్రానికి వచ్చేస్తున్నది’ అని తమ సోషల్ మీడియా హ్యాండిల్స్ లో చాటుకోవడమూ, తమ అనుకూల మీడియాతో డప్పు కొట్టించుకోవడమూ మాత్రమే కాదు. కనీసం ఆ సంస్థ తమ అధికారిక వెబ్ సైట్ లో గానీ, సోషల్ మీడియాలలో గానీ.. మన నాయకులతో భేటీని ఒక అచీవ్‌మెంట్‌గా ప్రకటించుకున్నదా? ఏపీలో పెట్టుబడుల గురించి ప్రతిపాదనలు వచ్చాయని, కనీసం తమ సంస్థ వాటి గురించి ఆలోచిస్తున్నదని అధికారికంగా ప్రకటించినదా? లేదా.. ఏపీలో పెట్టుబడులు పెట్టబోతున్నట్టుగా చెప్పినదా..? అలా జరిగితేనే అడుగు ముందుకు పడినట్టు లెక్క. ఆ దశకు వచ్చిన తర్వాత%-% ప్రతిపక్షం వాళ్లు ఎలాంటి కుట్రలు చేస్తే ఆ పెట్టుబడులు రాకుండా ఆగిపోయాయో కూడా చెప్పాలి. లేఖ రాశారా? ఫోను చేశారా? ఎలా బెదిరించారు? ఏం ఆధారాలున్నాయి.. తేల్చాలి. అదేమీలేకుండా గాలివాటుగా.. తామేదో డాంబికంగా ప్రకటించుకున్న సంస్థలు రాష్ట్రానికి ఎప్పటికీ వచ్చే ఉద్దేశం కనపరచకపోతే.. అదంతా విపక్షాల కుట్ర అని చాటేస్తే, తమ చేతగానితనం చాటుకోవడమే అవుతుంది.

నిష్కృతి లేదా?

ఇలాంటి బెదిరింపులకు, వ్యవస్థలు గాడితప్పడానికి తరణోపాయం లేదా? అంటే ఉంది. ముందుగా పార్టీల నాయకులకు చిత్తశుద్ధి ఉండాలి. సమాజహితం పట్ల కాంక్ష ఉండాలి. ప్రభుత్వం చేస్తున్న పని తప్పు అనే అభిప్రాయం విపక్షానికి ఉంటే.. తాము అధికారంలోకి వచ్చాక ఏం చేస్తామో చెప్పి బెదిరించడం కాదు.. అసలు ఆ తప్పు జరగనివ్వకుండా వారు పోరాడాలి. ప్రజాపోరాటాలు, న్యాయపోరాటాలు అనేక మార్గాలు అందుకు ఉన్నాయి. ఒక పార్టీ అధికారంలోకి వచ్చినంత మాత్రాన రాష్ట్రం మీద వారికి గుత్తాధిపత్యం దక్కదు. అధికారం అనేది చక్రవర్తిత్వం కాదు. వారి నిర్ణయాలను అడ్డుకోవడానికి ప్రజాస్వామిక వ్యవస్థలో ఉన్న అన్ని మార్గాలను అన్వేషించాలి.. పోరాడాలి.. సాధించాలి! తమ పోరాటాల ద్వారా ప్రజల హృదయాలను కూడా గెలవాలి. ప్రభుత్వాలు చేస్తున్నది తప్పు అని సాధికారికంగా నిరూపించాలి. కానీ.. అలాంటి పనిచేయకుండా.. ప్రభుత్వాలు కేవలం బెదిరింపుల మీదనే తాము మనుగడ సాగించాలని అనుకోవడం దారుణం.రాజకీయ పార్టీలు వ్యక్తిగత శత్రువుల్లాగా మారిపోయి ఇలాంటి దూషణలకు, నిందలకు, బెదిరింపులకు దిగుతుండడం అనేది అత్యంత నిరాశాజనకమైన పరిస్థితి. నిబద్ధతతో, నిజమైన వ్యాపార దృక్పథంతో, తన వ్యాపారం ద్వారా నలుగురికీ మంచి జరగాలని, స్థిరమైన ఉపాధి ఇవ్వాలనే సదాలోచనతో వ్యవహరించే పెట్టుబడిదారులు కరవైపోతారు. ప్రభుత్వం ఉన్నత హోదాలో ఉద్యోగిగా విధులు నిర్వర్తిస్తున్నందుకు, తన వల్ల సమాజానికి ప్రజలకు గరిష్ట మేలు జరగాలనే అధికారులు మాయమైపోతారు.రెండు తెలుగు రాష్ట్రాలు కూడా ఇలాంటి దుస్థితి వలన పతనం అవుతాయే తప్ప.. పురోగమించవు. ఆ స్పృహ అన్ని పార్టీలూ కలిగి ఉండాలి.

# తహవ్వుర్ హుస్సేన్ రాణాను అప్పగించడం మోడీ దౌత్య విజయానికి ప్రతీక



న్యూఢిల్లీ, ప్రపంచాన్ని వణికించిన ముంబయి ఉగ్రదాడి ప్రధాన కుట్రదారుల్లో ఒకడైన తహవ్వుర్ హుస్సేన్ రాణాను ఎట్టకేలకు భారత్‌కు తీసుకుని రావడం ఓ రకంగా భారత్ దౌత్య విజయంగా చెప్పుకోవాలి. వివిధ దేశాలతో దౌత్యపరంగా అనుసరిస్తున్న వ్యవహారాలను గమనించినప్పుడు రాణాను అమెరికా అప్పగించడం అన్నది ఓ రకంగా మోడీ దౌత్య విజయంగానే చూడాలి. అలాగే ఎన్ఐఏ చేసిన కృషి కూడా తక్కువేం కాదు. ఈ కారణంగానే రాణను అమెరికా అప్పగించడంతో భారత్‌కు తీసుకొచ్చారు. ప్రస్తుతం అతడు ఎన్ఐఏ కస్టడీలో ఉన్నాడు. ఈ పరిణామాల నేపథ్యంలో తహవ్వుర్ రాణా కేసుకు సంబంధించి గతంలో ప్రధాని మోదీ చేసిన ఓ ట్వీట్ ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. 14 ఏళ్ల క్రితం చేసిన ఆ పోస్ట్‌లో రాణా కేసును ఉద్దేశిస్తూ అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ దౌత్య విధానాలను మోదీ తీవ్రంగా విమర్శించారు. 2011లో ఈ కేసుపై అమెరికా కోర్టు కీలక తీర్పు వెలువరించింది. ముంబయి దాడుల్లో రాణా ప్రత్యక్ష పాత్ర లేదని తేల్చింది. అయితే, ఆ ఘటనకు కారణమైన ఉగ్ర సంస్థకు అండగా నిలిచాడన్న అభియోగాలపై అతడిని దోషిగా తేల్చింది. ఈ తీర్పుపై 2011 జూన్ 10న ప్రధాని మోదీ ట్విటర్ వేదికగా స్పందించారు. ముంబయి దాడుల ఘటనలో తహవ్వుర్ రాణాను అమాయకుడని యూఎస్ ప్రకటించడం.. భారత సార్వభౌమత్వాన్ని అవమానించడమే. మన దేశ విదేశాంగ విధానానికి ఇది భారీ ఎదురుదెబ్బ అని మోదీ ఆనాటి పోస్ట్‌లో రాసుకొచ్చారు. అప్పుడాయన గుజరాత్ సిఎంగా ఉన్నారు. ప్రస్తుతం రాణా అప్పగింత నేపథ్యంలో ఈ పోస్ట్‌ను నెటిజన్లు షేర్ చేస్తూ.. ప్రధాని దౌత్య విధానాలను కొనియాడుతు న్నారు. తహవ్వుర్ రాణాను తీసుకురావడంలో కేంద్ర ప్రభుత్వం భారీ విజయాన్ని సాధించిందని ప్రశంసిస్తున్నారు. ఇకపోతే రాణా అప్పగింతపై అమెరికా స్పందించింది. ఉగ్రదాడుల బాధ్యులకు తగిన శిక్ష పడేలా భారత్ చేస్తున్న ప్రతి పనికి సుదీర్ఘకాలంగా అమెరికా మద్దతు అందిస్తూ వస్తోంది. ప్రపంచవ్యాప్తంగా పెను సమస్యగా మారిన ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో ఈ రెండు దేశాలు కలిసి పని చేస్తున్నాయి. ఆ నిబద్ధతను చాటిచెబుతూ తహవ్వుర్ రాణాను అప్పగించాం అని అమెరికా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి టమ్మీ బ్రూస్ వెల్లడించారు. అమెరికాలోని లాస్ ఏంజెలెస్ నుంచి తహవ్వుర్ రాణాను అత్యంత కట్టుదిట్టమైన భద్రత నడుమ ప్రత్యేక విమానంలో గురువారం దిల్లీకి తీసుకొచ్చారు. అనంతరం పటియాల హౌస్ కోర్టులో హాజరుపర్చారు. దీనిపై కోర్టు విచారణ జరిపి రాణాను 18 రోజుల ఎన్ఐఏ కస్టడీకి అప్పగించింది. ఇప్పుడు కస్టడీలో రాణాను ప్రశ్నించడం ద్వారా వివరాలు రాబట్టనున్నారు. ప్రధాని మోదీ ఫిబ్రవరిలో అమెరికా వెళ్లినప్పుడే రాణా అప్పగింతకు మార్గం సుగమమైంది. 14న మోదీతో జరిగిన సమావేశానంతరం సంయుక్త మీడియా సమావేశంలో ట్రంప్ ఈ విషయాన్ని ప్రకటించారు. భారత్, అమెరికాల మధ్య నేరస్థుల అప్పగింత ఒప్పందం ఉండటంతో రాణాను అగ్రరాజ్యం కస్టడీలో ఉంచింది. అతడి అప్పగింతపై అన్ని కోర్టుల్లో ఎన్ఐఏ విజయం సాధించడంతో తరలింపు సాకారమైంది. రాణాను భారత్‌కు అప్పగించాలని 2023 మే 16వ తేదీన సెంట్రల్ డిస్ట్రిక్ట్ ఆఫ్ కాలిఫోర్నియా జిల్లా కోర్టు ఆదేశాలిచ్చింది. దానిని నైన్త్ సర్క్యూట్ కోర్టులో పలు లిటిగేషన్లద్వారా అతడు సవాలు చేశాడు. వాటన్నింటినీ కోర్టు తిరస్కరించింది. అనంతరం రిట్ ఆఫ్ సర్టియోరరితోపాటు హెబియస్ పిటిషన్లను, అత్యవసర అప్పీళ్లను యూఎస్ సుప్రీంకోర్టులో రాణా దాఖలు చేశాడు. వాటిని సుప్రీంకోర్టు ఇటీవల తిరస్కరించడంతో అతడి అప్పగింతకు మార్గం సుగమమైంది. రెండు దేశాల మధ్య ఒప్పందం కారణంగా భారత్ సరెండర్ వారెంట్‌ను పొందడంతో రాణాను తరలించడం ప్రారంభమైంది. చివరకు అతడిని భారత్‌కు తీసుకొచ్చి భారత్ భారీ విజయం సాధించింది. తహవ్వుర్ రాణాను దేశానికి తీసుకు రావడాన్ని అతి పెద్ద దౌత్య విజయంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ఇది మోదీ ప్రభుత్వ దౌత్య నైపుణ్యాన్ని, న్యాయంపై నిబద్ధతను తెలియజేస్తుందని షా పేర్కొన్నారు. అయితే రాణా అప్పగింత ప్రక్రియను యూపీఏ హయాంలో ప్రారంభించామని కాంగ్రెస్ స్పష్టం చేసింది. కానీ మోడీ విదేశాంగ విధానంపై విమర్శలు చేస్తున్న కాంగ్రెస్ ఇప్పుడు సమాధానం చెప్పాలి.

# తెలంగాణ నూతన డీజీపీగా సీవీ ఆనంద్?



హైదరాబాద్,రాష్ట్రంలో చీఫ్ సెక్రటరీ తరువాత పోలీసు శాఖలో డీజీపీ పోస్టుకు ప్రాముఖ్యం, ప్రాధాన్యం ఉంది. గతేడాది జూలై నెలలో 1992 ఐపీఎస్ బ్యాచ్ కు చెందిన జితేందర్ నూతన డీజీపీగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన పదవీకాలం మరో ఐదు నెలల్లో ముగియనుండడంతో నూతన డీజీపీ ఎంపికకు ఇప్పటి నుంచే కసరత్తు మొదలైంది. తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) నియామకం కోసం జాబితాను సిద్ధం చేశారు. డీజీపీ పోస్టు కోసం ముగ్గురి పేర్లను ఎంపిక చేసి కేంద్రానికి పంపించాల్సి ఉండగా ఐదుగురి పేర్లను ఖరారు చేశారు. వీరి పేర్లను నేడో రేపో కేంద్ర ప్రభుత్వానికి పంపించనున్నారని విశ్వసనీయంగా తెలిసింది. ప్రస్తుత డీజీపీ జితేందర్ పదవీకాలం ఈ సంవత్సరం సెప్టెంబర్ నెలాఖరుతో ముగియనున్నది. రాష్ట్రంలో చీఫ్ సెక్రటరీ తరువాత పోలీసు శాఖలో డీజీపీ పోస్టుకు ప్రాముఖ్యం, ప్రాధాన్యం ఉంది. గతేడాది జూలై నెలలో 1992 ఐపీఎస్ బ్యాచ్ కు చెందిన జితేందర్ నూతన డీజీపీగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన పదవీకాలం మరో ఐదు నెలల్లో ముగియనుండడంతో నూతన డీజీపీ ఎంపికకు ఇప్పటి నుంచే కసరత్తు మొదలైంది. ఈ పదవిని దక్కించుకునేందుకు ఎవరికి వారుగా తమ ప్రయత్నాలు చేస్తున్నారని సమాచారం.సీనియార్టీ జాబితా ప్రకారం రవిగుప్తా (1990), సీవీ ఆనంద్ (1991), కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి (1994), బీ శివధర్ రెడ్డి (1994), సౌమ్యా మిశ్రా (1994), శిఖా గోయల్ (1994) పోటీలో ఉన్నారని సమాచారం. రవిగుప్తా రాష్ట్ర హెూం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా, ఆనంద్ హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. ఇక శివధర్ రెడ్డి ఇంటెలిజెన్స్ ఏడీజీగా ఉన్నారు. సౌమ్యా మిశ్రా డీజీ (జైళ్లు), శిఖా గోయల్ సీఐడీ అడిషనల్ డీజీపీగా కొనసాగుతున్నారు. సెక్రటరీ రవిగుప్తా ఈ ఏడాది డిసెంబర్ నెలాఖరుకు పదవీ విరమణ చేయనున్నారు. ఆ తరువాతి స్థానంలో సీవీ ఆనంద్ ఉన్నారు. ఆనంద్‌కు 2028 జూలై వరకు సర్వీసు ఉండటం కలిసి వచ్చే అవకాశంగా చెబుతున్నారు. కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి ఈ ఏడాది పదవీ విరమణ చేస్తుండగా, శివధర్ రెడ్డి వచ్చే ఏడాది ఏప్రిల్ నెలలో, సౌమ్యా మిశ్రా 2027 డిసెంబర్ చివరన, శిఖా గోయల్ 2029 మార్చి నెలాఖరుకు పదవీ విరమణ చేయనున్నారు. ఆనంద్, శివధర్ రెడ్డి స్థానికులు కావడం మూలంగా ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి వీరిద్దరిలో ఒకరిని డీజీపీగా ఎంపిక చేసేందుకు మొగ్గు చూపవచ్చని పోలీసు ఉన్నతాధికారుల్లో చర్చలు నడుస్తున్నాయి.ఆనంద్‌కు రాష్ట్ర సర్వీసులతో పాటు కేంద్ర సర్వీసులో పనిచేసిన అనుభవం కూడా ఉన్నది. పైగా సౌమ్యుడనే ముద్ర ఉంది. ఏ ఒక్కరికీ అనుకూలంగా వ్యవహరించకుండా చట్టపరిధిలో వ్యవహరిస్తారనే పేరుండటం అదనపు అర్హతగా ఉన్నతాధికారులు చెబుతున్నారు. సాధారణంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ డీజీపీ పదవికి మూడు పేర్లను మాత్రమే సిఫారసు చేస్తుంది. కానీ ఈసారి ఐదుగురి పేర్లను యూపీఎస్సీకి సిఫారసు చేస్తున్నట్టు తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన పేర్లను పరిశీలించిన యూపీఎస్సీ.. కేంద్ర హెూం శాఖకు సిఫారసు చేసింది. అందులో ఒకరిని ఎంపిక చేసి తిరిగి రాష్ట్రానికి పంపించడం ఆనవాయితీగా వస్తుంది. పేరును ఖరారు చేసే ముందు రాష్ట్ర ముఖ్యమంత్రి అభిప్రాయాన్ని హెూం శాఖ పరిగణనలోకి తీసుకుటుందని ఉన్నతాధికారులు చెబుతున్నారు. జాబితా సిద్ధం చేసే నాటికి రిటైర్మెంట్‌కు కనీసం ఆరు నెలల సర్వీసు ఉండాలని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) 2023 నవంబర్ నెలలో నిబంధన కొత్తగా తీసుకువచ్చింది.

# ఎన్ఆర్ఎస్సీతో హైడ్రా ఒప్పందం.. ఇక భూ వివరాలు ఎంతో సులభం !



హైదరాబాద్,ఓఆర్ ఆర్ పరిధిలో భూముల వివరాలు అందరికీ అందుబాటులోకి తీసుకురాడానికి హైడ్రా కసరత్తు ప్రారంభించింది. చెరువులు, ప్రభుత్వ భూములు, పార్కులకు సంబంధించి సరైన హద్దులతో సమాచారాన్ని సేకరిస్తోంది. ఈ క్రమంలో ఎన్ఆర్ఎస్సీ (నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్)తో హైడ్రా శుక్రవారం ఒప్పందం కుదుర్చుకుంది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, ఎన్ఆర్ఎస్సీ డైరెక్టర్ డా.ప్రకాష్ చౌహాన్ ఈ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. చెరువుల ఎఫ్టీఎల్, బఫర్ జోన్లకు సంబంధించి హద్దుల విషయంలో ఎలాంటి అపోహలకు ఆస్కారం లేకుండా సరైన సమాచారం అందించడమే హైడ్రా ముందున్న లక్ష్యమని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ చెప్పారు.ప్రభుత్వ స్థలాలు, పార్కులు, రహదారులు ఇలా ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాల సమాచారం ప్రజలకు అందుబాటులోకి తీసుకురాడానికి ఎన్ఆర్ఎస్సీతో నేడు కుదుర్చుకున్న ఒప్పందం మైలురాయి లాంటిదన్నారు. 1970వ సంవత్సరంలో సర్వే ఆఫ్ ఇండియా సర్వే చేసిన టోపో షీట్లు, కెడెస్ట్రియల్ మ్యాప్స్, రెవెన్యూ రికార్డులు, చెరువులకు సంబంధించిన సమాచారంతో పాటు ఎన్ఆర్ఎస్సీ శాటిలైట్ ఇమేజీలతో సమగ్ర సమాచారం అందుబాటులోకి తీసుకురావడమే హైడ్రా లక్ష్యమన్నారు.

చెరువుల పునరుద్ధరణ చర్యలు తీసుకున్న మొదటి రాష్ట్రంగా తెలంగాణ చెరువుల పునరుద్ధరణ, ప్రభుత్వ స్థలాల పరిరక్షణ, పర్యావరణ హితమైన నగరాన్ని రూపొందించడానికి ఇంత పెద్దయెత్తున చర్యలు తీసుకున్న మొదటి రాష్ట్రంగా తెలంగాణ నిలబడుతుందని ఎన్ఆర్ఎస్సీ డైరెక్టర్ డా.ప్రకాష్ చౌహాన్ అన్నారు. పర్యావరణాన్ని కాపాడుకుంటే.. దేశంలోనే గొప్ప నగరంగా హైదరాబాద్ పేరుగాంచుతుందని అన్నారు. హైడ్రా చర్యలతో ఇది సాధ్యమౌతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విషయంలో హైడ్రాకు పూర్తి సహకారం అందిస్తామన్నారు.

# గోవధ శాలగా మారిన ఎస్వీ గోశాల



తిరుపతి,ఎస్వీ గోశాల గోవధ శాలగా మారింది.. ఇది సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేసిన పాపమే అంటూ టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తిరుపతిలోమీడియాతో మాట్లాడిన ఆయన.. గోవులు దేవుళ్లతో సమానం.. టిటిడి ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్వీ గోశాలలో గోవులు దారుణంగా చనిపోతున్నాయి.. వెంకటేశ్వర స్వామికి ప్రీతికరమైనది గోమాత.. హిందూ ధర్మ పరిరక్షణ ధ్యేయం అంటున్న ఎన్డీఏ ప్రభుత్వంలో వందకు పైగా గోవులు చనిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.. టిటిడి అధ్వర్యంలో నడుస్తున్న ఎస్వీ గోశాలలో గత మూడు నెలలుగా వందకుపైగా ఆవులు చనిపోతున్నా.. పట్టించుకోకుండా ఉన్నారు.. ఎస్వీ గోశాలలో గోవులను దుస్థితి దారుణంగా ఉంది. వందకు పైగా ఆవులు చనిపోయాయి.. ఆ లెక్కలు, ఆవుల మృతి బయటకు రాకుండా చూశారు.. కనీసం పోస్టు మార్టం లేకుండా గుట్టుచప్పుడు కాకుండా తరలించారు. ఈ మహాపాపం టిటిడిది, ప్రభుత్వానిది కాదా అని నిలదీశారు. గోశాలపై పర్యవేక్షణ లో అధికారి లేకపోవడం తోనే ఈ దుస్థితికి కారణం అన్నారు కరుణాకర్‌రెడ్డి.. గోవుల మరణాలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేసిన ఆయన.. ఎస్వీ గోశాల నుండి తిరుమలకు పాలు వెళ్తాయి.. స్వామి వారికి నైవేద్యంగా వెన్న ఇక్కడ నుండి ఇస్తారు.. వైసీపీ పాలనలో గుజరాత్, రాజస్థాన్ సహా ఇతర రాష్ట్రాల నుండి ఆవులను తీసుకోచ్చి స్వామి వారి సేవలు అందించాం.. 580 ఆవులను మా ప్రభుత్వంలో తీసుకొచ్చాం... వైసిపి పాలనలో 1500 లీటర్ల పాలు తిరుమలకు రోజు అందించాం.. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఐదు వందల లీటర్ల పాలు తిరుమలకు వెళ్లడం లేదని విమర్శించారు.. అయితే, పవన్ కల్యాణ్, చంద్రబాబు.. జగన్ పై అసత్య ప్రచారం చేశారు.. కానీ, హిందు ధర్మాన్ని కాపాడింది జగన్.. కూటమి ప్రభుత్వం టిటిడి ఎస్వీ గోశాలనే రక్షించలేకపోయారు.. అక్కడి అధికారుల నిర్లక్ష్యంతోనే గోవులను చనిపోయాయి... ఇప్పటి వరకు టీ-టీ-డీ జేఈవో, సీవీ ఎస్వీ సహా ఇతర అధికారులను నియమించలేదు... తొక్కిసలాట ఘటనలో ఏమాత్రం సంబంధం లేని ఎస్వీ గోశాల డైరెక్టర్ హరినాథ్ రెడ్డి కావాలనే సస్పెండ్ చేసి.. ఇప్పుడు గోవుల మృతికి చంద్రబాబు కారణం అయ్యారని దుయ్యబట్టారు..

# రాష్ట్ర కమల దళాధిపతిగా నయినార్ నాగేంద్రన్

చెన్నై: రాష్ట్ర కమల దళాధిపతిగా తిరునల్వేలి ఎమ్మెల్యే నయినార్ నాగేంద్రన్ పదవిని అధిరోహించడం ఖాయమైపోయింది. రాష్ట్ర బీజేపీ అధ్యక్ష్య పదవికి జరిగిన ఎన్నికల్లో నయినార్ నాగేంద్రన్ మాత్రమే నామినేషన్ దాఖలు చేయడంతో అధికారిక ప్రకటన లాంఛనమే అయింది. ఈ మేరకు బీజేపీ అధిష్ఠానం శనివారం ప్రకటించనుంది. పార్టీ నిర్వహణ రీత్యా రాష్ట్ర బీజేపీలో 67 జిల్లాలున్నాయి. పార్టీలో కొత్త సభ్యుల చేరిక గత ఏడాది సెప్టెంబరులో ప్రారంభించారు. అనంతరం నవంబరులో శాఖల స్థాయిలో ఎన్నికలు చేపట్టి నిర్వాహకులను ఎంపిక చేశారు.తదుపరి మండల అధ్యక్షులు, జిల్లా అధ్యక్ష పదవులకు ఎన్నికలు నిర్వహించారు. ఈ ఏడాది జనవరిలో కొత్త జిల్లా అధ్యక్షులు నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు పదవికి జనవరిలో ఎన్నికలు జరగాల్సి ఉంది. ఢిల్లీ శాసనసభ ఎన్నికలు సహా వివిధ కారణాలతో అధ్యక్ష పదవి ఎన్నికలో జాప్యం నెలకొంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర అధ్యక్ష పదవికి శనివారం ఎన్నిక జరగనుందని ప్రకటించారు. ఈ పదవికి పోటీచేసే అభ్యర్థులు, శుక్రవారం రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో నామినేషన్లు సమర్పించాలని ఎన్నికల నిర్వాహకులు ప్రకటించారు.అయితే బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవికి నయినార్ నాగేంద్రన్ మాత్రమే నామినేషన్ దాఖలు చేశారు. నాగేంద్రన్ నామినేషన్‌ను ప్రస్తుత అధ్యక్షుడు అన్నామలై, మాజీ అధ్యక్షుడు పొన్.రాధాకృష్ణన్, హెచ్.రాజా, ఎమ్మెల్యే వానతి శ్రీనివాసన్, కనక సభాపతి, వీపీ దురైస్వామి, పొన్ బాలగణపతి తదితరులు బలపరిచారు. నామినేషన్ దాఖలు చేసిన అనంతరం నాగేంద్రన్‌కు పార్టీ సీనియర్ నేతలు శుభాకాంక్షలు తెలిపారు. నామినేషన్ల స్వీకరణ సాయంత్రం 4 గంటలకు ముగియగా, ఇతరులెవ్వరూ దాఖలు చేయకపోవడంతో, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా నయినార్ నాగేంద్రన్ ఎన్నిక ఖరారైపోయింది.

చివరి నిమిషంలో మారిన నిబంధన...

బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, జాతీయ సర్వసభ్య మండలి సభ్యులు తదితర పదవుల్లో పోటీ చేసేందుకు ఆసక్తి చూపే నేతలకు పదేళ్ల పాటు ప్రాథమిక సభ్యత్వం ఉండాలంటూ గురువారం ప్రకటించారు. కానీ, ఈ పదవికి పోటీ చేస్తారని భావించిన అన్నామలై, నయినార్ నాగేంద్రన్‌కు పదేళ్ల పార్టీ సభ్యత్వం లేకపోయింది. దీంతో, శుక్రవారం నామినేషన్ల సమయంలో కొంత గందరగోళం నెలకొంది. అంతలోనే పోటీ చేసే అభ్యర్థులకు విధించిన నిబంధనలను సడలించారు. ఆంధ్ర, సిక్కిం రాష్ట్రాల అధ్యక్ష పదవుల ఎన్నిక సందర్భంగా, 10 ఏళ్ల ప్రాథమిక సభ్యత్వం నుంచి మినహాయింపు కల్పించినట్లు పార్టీ చివరి నిమిషంలో ప్రకటించడంతో, నయినార్ నాగేంద్రన్ నామినేషన్ దాఖలుచేశారు.

అన్నాడీఎంకేతో రాజకీయ ప్రస్థానం...

రాష్ట్ర కమల దళాధిపతిగా పదవీ బాధ్యతలు చేపట్టనున్న దేవర్ సామాజిక వర్గానికి చెందిన 64 ఏళ్ల నయినార్ నాగేంద్రన్ రాజకీయ జీవితం అన్నాడీఎంకేతో మొదలైంది. తిరునల్వేలి జిల్లా పనకుడి సమీపం తండయార్‌కుళానికి చెందిన నాగేంద్రన్ పీజీ డిగ్రీ చేశారు. ఆయనకు భార్య చంద్ర, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. 1989లో అన్నాడీఎంకేలో చేరిన నాగేంద్రన్, పనకుడి నగర కార్యదర్శి, యువజన విభాగం కార్యదర్శి, తిరునల్వేలి నగర జిల్లా జయలలిత పేరవై కార్యదర్శి, రాష్ట్ర జయలలిత పేరవై కార్యదర్శి, ఎన్నికల విభాగం సంయుక్త కార్యదర్శి తదితర పదవులు నిర్వహించారు.

విద్యుత్, కార్మికశాఖ మంత్రిగా...

2001 తిరునల్వేలి శాసనసభ నియోజకవర్గంలో అన్నాడీఎంకే తరఫున పోటీ చేసి విజయం సాధించి, నాటి ముఖ్యమంత్రి జయలలిత మంత్రివర్గంలో విద్యుత్, కార్మిక శాఖల మంత్రిగా పనిచేశారు. మళ్లీ 2006లో తిరునల్వేలి నియోజకవర్గం లో పోటీ చేసి పరాజయం పాలయ్యారు. 2011లో జరిగిన ఎన్నికల్లో తిరునల్వేలి నియోజకవర్గం నుంచి ఎన్నికైనా, ఆయనకు మంత్రి పదవి లభించలేదు.

బీజేపీలో చేరిక...

2016లో మళ్లీ తిరునల్వేలి నియోజకవర్గం నుంచి పోటీ చేసి పరాజయం పొందారు. జయలలిత మరణానంతరం అన్నాడీఎంకేలో ఏర్పడిన విభేదాల కారణంగా ఆ పార్టీ నుంచి వైదొలిగి 2017లో బీజేపీలో చేరారు. అప్పటినుంచి బీజేపీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్న ఆయన, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వ్యవహరించారు. 2019లో రామనాథపురం పార్లమెంటు నియోజకవర్గం నుంచి బీజేపీ తరఫున పోటీచేసి పరాజయం చవిచూశారు. అనంతరం 2021లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో తిరునల్వేలి నియోజకవర్గం నుంచి బీజేపీ తరఫున పోటీచేసే అవకాశం దక్కింది. ఆయనకు మద్దతుగా కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా ప్రచారం చేశారు. ఈఎన్నికల్లో నయినార్ నాగేంద్రన్ విజయం సాధించి, బీజేపీ శాసనసభ పక్షనేతగా వ్యవహరిస్తున్నారు. 2024లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో తిరునల్వేలి పార్లమెంటు నియోజకవర్గం నుంచి పోటీ చేసిన నాగేంద్రన్, కాంగ్రెస్ అభ్యర్థి రాబర్ట్ బ్రూస్ చేతిలో పరాజయం పాలయ్యారు.

# మళ్లీ పర్మిట్ రూమ్‌లు..ఎక్సైజ్ శాఖ పునరాలోచన



విజయవాడ:పర్మిట్ రూమ్‌ల రద్దుతో ప్రభుత్వం రూ.175 కోట్ల ఆదాయాన్ని కోల్పోయింది. బహిరంగ మద్యపానం పెరగడంతో మళ్లీ వాటిని పునరుద్ధరించే యోచనలో ఎక్సైజ్ శాఖ ఉందిఒక నిర్ణయం తీసుకునే ముందు... పర్యవసానాలు ఆలోచించాలి! ఆదాయం మాత్రమే కాదు... దాని వల్ల తలెత్తే పరిణామాలూ పరిశీలించాలి. ఇలా ముందూ వెనుకా చూడకుండా తీసుకున్న ఒక నిర్ణయం సర్కారు ఆదాయాన్ని పోగొట్టడమే కాదు, బహిరంగ ప్రదేశాల్లో తాగుడుకూ కారణమైంది. ఆ నిర్ణయమే... పర్మిట్ రూమ్‌ల రద్దు! మద్యం షాపులకు అనుబంధంగా నిలబడి మాత్రమే తాగేందుకు వీలుగా ఏర్పాటుచేసే పర్మిట్ రూమ్‌లకు అనుమతి ఇవ్వొద్దని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం తీసుకుంది. అయితే... దాని వల్ల తలెత్తే ఇబ్బందులను వివరించడంలో ఎక్సైజ్ అధికారులు విఫలమయ్యారు. పర్మిట్ రూమ్‌ల రద్దు నిర్ణయం వల్ల ప్రభుత్వం రూ.175 కోట్ల ఆదాయం కోల్పోయింది. ఆదాయం సంగతి పక్కనపెడితే... పర్మిట్ రూమ్ లేకపోయినా సరే మందుబాబులు సీసాలు కొనుక్కుని షాపుల దగ్గరే తాగుతున్నారు. దీంతో మళ్లీ పర్మిట్ రూమ్‌లు పెట్టాలని ఎక్సైజ్ శాఖ ఆలోచన చేస్తోంది. తాజాగా తిరుపతిలో జరిగిన ఎక్సైజ్ సమీక్ష సమావేశంలో ఈ అంశం చర్చకు వచ్చింది. పర్మిట్ రూమ్‌లకు అనుమతి ఇవ్వడమే మంచిదని, దానివల్ల బహిరంగ ప్రదేశాల్లో తాగుడు గోల పోతుందని ఎక్కువ మంది అధికారులు అభిప్రాయపడ్డారు. దీంతో దీనిపై ఓ కమిటీ వేయాలని ఎక్సైజ్ శాఖ భావిస్తోంది.

ఆదాయం ఇలా నష్టం..

సాధారణంగా మద్యం షాపుల వద్ద మందు కొనుక్కునేవారు అక్కడే తాగుతుంటారు. అయితే వారు షాపు ముందు, రోడ్లపై తాగకుండా ఎక్సైజ్ శాఖ పర్మిట్ రూమ్‌లకు అనుమతిస్తుంది. షాపు లైసెన్సీ అక్కడే ఒక చిన్న రూమ్ ఏర్పాటుచేసి తాగేందుకు అవకాశం కల్పిస్తారు. అందుకోసం లైసెన్సీ ఏడాదికి రూ.5లక్షలు ఎక్సైజ్ శాఖకు చెల్లించాలి. గతేడాది అక్టోబరులో 3,396 షాపులకు లైసెన్స్‌లు జారీచేశారు. ఆ తర్వాత గీత కులాలవారికి 340 షాపులు ఇచ్చారు. మొత్తంగా 3,500 షాపుల లైసెన్సీలు రూ.5లక్షల చొప్పున చెల్లించినా రూ.175 కోట్ల ఆదాయం వచ్చేది. గతంలో మద్యం షాపుల వద్ద పర్మిట్ రూమ్‌లకు అవకాశం ఉండేది. కానీ వైసీపీ ప్రభుత్వం వాటిని రద్దు చేసింది. షాపుల వద్ద తాగుడు తగ్గిస్తామని ఆ నిర్ణయం తీసుకుంది. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా, ఎక్సైజ్ శాఖ అదే బాటలో నడిచింది. పర్మిట్ రూమ్‌లకు అవకాశం ఇస్తే మద్యం షాపులు మినీ బార్లుగా మారతాయని మంత్రివర్గ ఉపసంఘం అభిప్రాయపడింది. అయితే పర్మిట్ రూమ్‌లకు అవకాశం ఇవ్వకపోతే కొత్త ఇబ్బందులు వస్తాయనే విషయాన్ని ఎక్సైజ్ శాఖ అధికారులు ఉపసంఘానికి సరైన రీతిలో వివరించలేదు. ఉపసంఘం తీసుకున్న నిర్ణయాన్ని యథావిధిగా అమలుచేశారు. ఫలితంగా భారీ నష్టం వచ్చింది.

అయినా ఫలితం ఎక్కడ?

అంత ఆదాయం కోల్పోయినా ప్రయోజనం మాత్రం శూన్యమే. నిజానికి, గత వైసీపీ ప్రభుత్వంలోనే ఈ నిర్ణయం వల్ల ఇబ్బందులు తలెత్తాయి. షాపుల వద్ద తాగేందుకు అనుమతివ్వకపోవడంతో రోడ్లపై విచ్చలవిడిగా తాగుతూ మందుబాబులు సాధారణ ప్రజలను ఇబ్బందులకు గురిచేసేవారు. అయినా కూటమి ప్రభుత్వం కూడా అదే నిర్ణయం తీసుకోవడంతో మళ్లీ అదే పరిస్థితి రాష్ట్రంలో కనిపిస్తోంది. చాలా చోట్ల మందుబాబులు రోడ్లపైనే మందు తాగుతున్నారు. అలాగే అనుమతి లేకపోయినా షాపుల లైసెన్సీలు అక్కడే తాగేందుకు అవకాశం కల్పిస్తున్నారు. తరచూ దీనిపై ఫిర్యాదులు రావడంతో ఎక్సైజ్ సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తున్నా, పెద్దగా ప్రయోజనం కనిపించట్లేదు.

## గంధమల్ల రిజర్వాయర్ సామర్థ్యం తగ్గింపు

హైదరాబాద్,గంధమల్ల రిజర్వాయర్ సామర్థం తగ్గించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటి వరకు 4.28 టీ-ఎంసీల సామర్థం ఉన్న గంధమల్ల రిజర్వాయర్ నీటి సామర్థ్యాన్ని 1.41 టీ-ఎంసీలకు తగ్గిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. యాదాద్రి భువనగిరి జిల్లాకు నీరు అందించే లక్షంతో గంధమల్ల రిజర్వాయర్ ను గత ప్రభుత్వం ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం గంధమల్ల రిజర్వాయర్ సామర్థం 1.41 టీ-ఎంసీలుగా నిర్ధారిస్తూ

## యూపిలో భాకీ వర్షాలతో అతలాకుతలం

లక్నో,ఉత్తరప్రదేశ్‌లో ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. రాష్ట్రవ్యాప్తంగా కురిసిన భారీ వర్షాల వల్ల కనీసం 22 మంది అయినా మృతి చెందారు. ఇక ఈ వర్షాల దెబ్బకు 15 ఇళ్లు ధ్వంసమయ్యాయి. 45 జంతువులు చనిపోయినట్లు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటన పేర్కొంది. ఈ సందర్భంగా మృతులకు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సంతాపం తెలిపారు. బాధిత కుటుంబాలకు నాలుగు లక్షల రూపాయలు పరిహారాన్ని ప్రకటించారు. ఈ మేరకు యోగి ఆదిత్యనాథ్ ఎక్స్ పోస్టులో వెల్లడించారు. కాగా, కూడా ఉత్తరప్రదేశ్‌లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. దీంతో ప్రాంతీయ వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్‌ను జారీ చేసింది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com